తెలంగాణ

TELANGANA MUCHATLU

ముచ్చట్లు

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | గురువారం - 12 - నవంబర్ 2026 | సంపుటి : 4 | సంచిక : 158 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

ఇంటర్‌కు స్వస్తి..

పాఠశాలల్లోనే 12వ తరగతి!

హైదరాబాద్, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్రంలో విద్యార్థుల ప్రయోజనాలే లక్ష్యంగా సమూల విద్యా సంస్కరణలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నర్సరీ నుంచి విశ్వవిద్యాలయం వరకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, మారుతున్న ప్రపంచ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ దిశగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి 12వ తరగతి వరకు ఒకే విద్యా విధానాన్ని అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

విద్యాశాఖపై మంగళవారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యా వ్యవస్థలో తీసుకురావాల్సిన మార్పులు, పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్తు, ఉన్నత విద్య, వృత్తి విద్యా కోర్సులు తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు.కొత్త విద్యా విధానంలో నర్సరీ నుంచి నాలుగో తరగతి వరకు ప్రాథమిక విద్య, ఐదు నుంచి ఎనిమిదో తరగతి వరకు మాధ్యమిక విద్య, తొమ్మిది నుంచి పన్నెండో తరగతి వరకు సీనియర్ మాధ్యమిక విద్య కొనసాగించాలని ముఖ్యమంత్రి సూచించారు. పన్నెండో తరగతి పూర్తయ్యే నాటికి విద్యార్థులకు భాషా నైపుణ్యాలు, సమాచార పరిజ్ఞానంపై పూర్తి పట్టు ఉండేలా బోధన అందించాలని అన్నారు. ఆ తర్వాత విద్యార్థులు తమ ఆసక్తికి అనుగుణంగా నచ్చిన రంగాన్ని ఎంచుకుని అందులో నిపుణులుగా ఎదిగేలా అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు.

అద్దె భవనాల్లో సంక్షేమ వసతి గృహాలు ఉండకూడదు

రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు ఎట్టి పరిస్థితుల్లోనూ అద్దె భవనాల్లో కొనసాగడానికి వీల్లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అవసరమైన చోట సొంత భవనాలను నిర్మించి, విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

మిగతా 8 లో..

విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా విద్యా సంస్కరణలు

వచ్చే విద్యా సంవత్సరం నుంచి 12వ తరగతి వరకు ఒకే విద్యా విధానం

పదో తరగతి తర్వాత చదువు మానేస్తున్న విద్యార్థుల సంఖ్య తగ్గించడమే లక్ష్యం: సీఎం రేవంత్ రెడ్డి



చదువు మధ్యలోనే ఆగిపోకూడదు

పదో తరగతి పూర్తయిన తర్వాత చాలామంది విద్యార్థులు చదువును మధ్యలోనే ఆపేస్తున్నారని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. వారిలో ఎక్కువ మంది బాలికలు, దళిత, గిరిజన, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులే ఉంటున్నారని తెలిపారు. పన్నెండో తరగతి వరకు విద్య కొనసాగించే అవకాశం ఉన్న కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో చదువు మానేసే వారి సంఖ్య చాలా తక్కువగా ఉంటోందని వివరించారు.దేశంలోని 18 రాష్ట్రాల్లో ఇప్పటికే పన్నెండో తరగతి వరకు ఒకే విద్యా విధానం అమలవుతోందని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తెలంగాణలోనూ ఈ నిర్ణయం తీసుకుంటున్నామని చెప్పారు. ఈ మార్పుల వల్ల జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఉద్యోగ భద్రత, పదవీ విరమణ ప్రయోజనాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



తెలంగాణ బిడ్డలు ప్రపంచాన్ని శాసించేలా

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

- ప్రతి నియోజకవర్గానికి తెలంగాణ ప్రభుత్వ పాఠశాల..
- 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం
- దేశంలోనే ఆదర్శంగా యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలు
- కాజీపేటలో తెలంగాణ ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క


హనుమకొండ,నవంబర్11 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య అందించి, ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రోత్సహించడంతో పాటు భవిష్యత్తులో ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగేలా విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలు, తెలంగాణ ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 27 లక్షల మంది విద్యార్థులకు ఒకేసారి ఉదయం అల్పాహారం అందించడం దేశంలోనే కాకుండా ప్రపంచంలోనూ ప్రత్యేకమైన కార్యక్రమమని పేర్కొన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని కాజీపేట ప్రభుత్వ బాలుర పాఠశాల ప్రాంగణంలో తెలంగాణ ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తదితరులు పాల్గొన్నారు.

మిగతా 8 లో..

మూసీ ప్రక్షాళనకు అన్ని అనుమతులు.. త్వరలోనే టెండర్లు

- తొలి విడతలో 21 కిలోమీటర్ల మేర నది పునరుజ్జీవనం
- 1,372 చెరువుల్లో సగానికి పైగా కనుమరుగు..
- ఆక్రమణలపై వెనక్కి తగ్గేది లేదు
- తమ్మిడికుంట చెరువు ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు): హైదరాబాద్ నగర భవిష్యత్తుతో పాటు రాబోయే తరాల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు అత్యంత కీలకమైన మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టుకు సంబంధించి అన్ని అనుమతులు లభించాయని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వెల్లడించారు. త్వరలోనే ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. మొత్తం 55 కిలోమీటర్ల మేర

మిగతా 2 లో..

త్వరలోనే మూసీ రివర్ ఫ్రంట్ పనులు ప్రారంభం

- నైట్ ఎకానమీతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు
- హైదరాబాద్ పూర్వ వైభవాన్ని పునరుద్ధరిస్తాం..
- దేశ విదేశాల పర్యాటకులను ఆకర్షించేలా మూసీ అభివృద్ధి: రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):



మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభం కాబోతున్నాయని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వెల్లడించారు. మూసీ పరిసర ప్రాంతాలను అత్యంత సుందరమైన రివర్ ఫ్రంట్‌గా తీర్చిదిద్దడంతో పాటు, అక్కడ రాత్రివేళల్లోనూ ఆర్థిక కార్యకలాపాలు కొనసాగించేలా నైట్ ఎకానమీని అభివృద్ధి చేస్తామని తెలిపారు. దీనివల్ల స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు.


భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బంజారా భవన్‌లో నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ మూసీ అభివృద్ధి, విద్య, ఉపాధి, మైనారిటీల సంక్షేమం తదితర అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు.

హైదరాబాద్ నగరానికి ఘనమైన చరిత్ర, ప్రత్యేకమైన వైభవం ఉందని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. నగరంలోని పాత ప్రాంతాలను అభివృద్ధి చేయడంతో పాటు గత వైభవాన్ని తిరిగి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందడుగు వేసిందన్నారు. హైదరాబాద్‌ది కేవలం ఓల్డ్ సిటీ కాదని, ఒరిజినల్ సిటీని పునరుద్ధరించడమే తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. దేశ విదేశాల నుంచి పర్యాటకులు వచ్చేలా మూసీ రివర్ ఫ్రంట్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. రివర్ ఫ్రంట్ పరిసరాల్లో రాత్రివేళ ఆర్థిక కార్యకలాపాలను విస్తరించడం ద్వారా స్థానిక వ్యాపారాలకు ఊతం లభిస్తుందని, యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. ఈ అభివృద్ధి రాష్ట్ర ఆర్థిక పురోగతికి, తద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

విద్యకు పునాదులు వేసిన మౌలానా ఆజాద్

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యాశాఖ మంత్రిగా

మిగతా 8 లో..



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో హైదరాబాద్‌కు రాష్ట్రస్థాయి గుర్తింపు

- తెలంగాణలో తొలి స్వచ్ఛ నగరంగా గ్రేటర్ హైదరాబాద్‌కు గౌరవం
- అధికారులకు అభినందనలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు): స్వచ్ఛ సర్వేక్షణ్ 202526లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) తెలంగాణ రాష్ట్రంలో తొలి స్వచ్ఛ నగరంగా గుర్తింపు పొందడం పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పురస్కారాన్ని అందుకున్న ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో పాటు పారిశుద్ధ్య నిర్వహణలో భాగస్వాములైన సిబ్బందికి అభినందనలు తెలిపారు. నగరాన్ని

మిగతా 2 లో..

రైతుల కష్టాలు పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం: కేటీఆర్

- నిర్మల్ రైతు గర్జన సభలో ప్రభుత్వంపై విమర్శలు
- వ్యవసాయ కూలీలకు రూ.36 వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్
- రైతుబంధు, రుణమాఫీ వెంటనే అమలు చేయాలని కోరిన కేటీఆర్

2 లో..



తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

మూసీ ప్రక్షాళనకు అన్ని అనుమతులు.. త్వరలోనే టెండర్లు



(మొదటి పేజీ తరువాయి)

విస్తరించి ఉన్న మూసీ నదిలో తొలి విడతగా 21 కిలోమీటర్ల మేర పునరుజ్జీవన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. మూసీ ప్రక్షాళన అనేది కేవలం నది సుందరీకరణ కార్యక్రమం కాదని, ప్రజల జీవితాలతో ముడిపడిన బృహత్తర కార్యక్రమమని స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ ప్రాంతంలో అత్యాధునిక సౌకర్యాలతో పునరుద్ధరించిన తమ్మిడికుంట చెరువును బుధవారం ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ప్రజాపద్దుల సంఘం చైర్మన్ ఆరెకపూడి గాంధీ అధ్యక్షత వహించారు. సినీనటుడు అక్కినేని నాగార్జున ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ నగరంలోని చెరువులను ఆక్రమణల నుంచి విముక్తి చేసి, వాటి పూర్వ వైభవాన్ని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఈ క్రమంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొని నగరాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

భవిష్యత్ తరాల ప్రయోజనమే నా సంకల్పం

మూసీ నదిని ప్రక్షాళన చేయాలన్న నిర్ణయం వెనుక ఎలాంటి వ్యక్తిగత స్వార్థం లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తనకు ఎవరిపైనా కోపం లేదని, ఎవరికీ నష్టం కలిగించాలన్న ఉద్దేశం లేదని పేర్కొన్నారు. ప్రకృతిని కాపాడటం, భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించడమే తన ఆకాంక్ష అని చెప్పారు. మంచి సంకల్పంతో, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూర్చే కార్యక్రమాన్ని చేపట్టినప్పుడు కొందరికి ఇబ్బందులు కలిగినా వెనక్కి తగ్గే ప్రసక్తి లేదన్నారు.

తమ్మిడికుంట చెరువు పునరుద్ధరణ నిర్ణయం తీసుకున్న సమయంలోనూ కొన్ని ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయని, ప్రభుత్వ నిర్ణయాల వల్ల కొందరి మనసులు నొచ్చుకుని ఉండవచ్చని చెప్పారు. అయితే ఈ కార్యక్రమం వల్ల రాబోయే తరాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. నగరంలోని చెరువులను కాపాడటం, వాటి సహజ విస్తీర్ణాన్ని తిరిగి తీసుకురావడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు.

నాగార్జున సహకారం అభినందనీయం

తమ్మిడికుంట చెరువు పునరుద్ధరణలో భాగంగా గతంలో 14 ఎకరాలకే పరిమితమైన చెరువును సుమారు 30 ఎకరాల విస్తీర్ణానికి అభివృద్ధి చేసినట్లు ముఖ్యమంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో సినీనటుడు అక్కినేని నాగార్జున రెండు ఎకరాల స్థలాన్ని అందించి సమాజ ప్రయోజనం కోసం ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. నాగార్జున తన ఉదాత్తమైన నిర్ణయంతో సినిమాల్లోనే కాకుండా నిజజీవితంలోనూ కథానాయకుడిగా నిలిచారని ప్రశంసించారు. కార్యక్రమానికి తక్కువ సమయం ఉన్నప్పటికీ ముఖ్య అతిథిగా హాజరైన నాగార్జునకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములయ్యే వారిని గౌరవిస్తామని గతంలోనే శాసనసభ వేదికగా ప్రకటించామని గుర్తుచేశారు. అందులో భాగంగానే కార్యక్రమానికి వచ్చిన వెంటనే నాగార్జునకు శాలువా కప్పి సత్కరించినట్లు వెల్లడించారు.

చెరువుల నగరంగా హైదరాబాద్ పూర్వ వైభవం తీసుకొస్తాం

హైదరాబాద్ నగరమంటేనే చెరువులు, కొండలు, అద్భుతమైన సహజ శిలారూపాలని ముఖ్యమంత్రి అన్నారు. గొలుసుకట్టు చెరువులతో పాటు ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన శిలారూపాలు నగరానికి ప్రత్యేక అందాన్ని తీసుకొచ్చాయని వివరించారు. ఒకప్పుడు హైదరాబాద్‌లో 1,372 చెరువులు ఉండేవని, వివిధ కారణాలతో వాటిలో దాదాపు 50 శాతం కనుమరుగయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.

నగరాలకు వలస వచ్చిన పేదలు జీవనాధారం కోసం మూసీ పరివాహక ప్రాంతాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకోవడం, కొందరు స్వార్థపూరితంగా చెరువులను ఆక్రమించడం, ప్రభుత్వాల నిర్లక్ష్యం వంటి అనేక కారణాలతో చెరువుల ఉనికి ప్రమాదంలో పడిందన్నారు. కొన్ని చెరువులు 10 ఎకరాల నుంచి 500 ఎకరాల వరకు విస్తీర్ణంలో ఉండాల్సి ఉండగా, ఆక్రమణల కారణంగా వాటి అసలు స్వరూపమే మారిపోయిందని చెప్పారు.

తమ్మిడికుంటతో పాటు బతుకమ్మకుంట, బుమ్‌రుక్నుద్దౌలా, సున్నం చెరువు, నల్లచెరువు, ఫాక్స్ సాగర్, మియాపూర్ చెరువు వంటి దాదాపు 20 చెరువులను పునరుద్ధరించి సుందరంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. నగరంలోని చెరువులను ఆక్రమణల నుంచి కాపాడటానికి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు.

చెరువుల ఆక్రమణలే నగర ముంపునకు ప్రధాన కారణం

వర్షాలు కురిసినప్పుడు హైదరాబాద్ రహదారులు జలమయమవడం, గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడం, కాలనీలు నీట మునగడం వంటి సమస్యలకు కారణాలను ప్రతి ఒక్కరూ ఆలోచించాలని ముఖ్యమంత్రి సూచించారు. నీరు నిల్వ ఉండాల్సిన ప్రాంతాలను మనమే ఆక్రమించుకుంటే, చివరకు మనం నివసించే ప్రాంతాల్లోకి నీరు వస్తోందని వ్యాఖ్యానించారు. ఫలితంగా బస్తీల్లో నివసించే కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులు, నీటి ప్రవాహ మార్గాలను కాపాడుకోవడం ద్వారా మాత్రమే నగరానికి వరద ముప్పును తగ్గించగలమన్నారు. చెరువుల పునరుద్ధరణతో వర్షపు నీటిని నిల్వ చేయడంతో పాటు భూగర్భ జలాలను పెంచుకోవచ్చని తెలిపారు.

1908 వరదల తర్వాతే ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నిర్మాణం

1908లో హైదరాబాద్ నగరాన్ని భారీ వరదలు ముంచెత్తాయని, ఈ విపత్తులో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. అప్పటి నిజాం నవాబు భవిష్యత్తులో ఇలాంటి విపత్తులు పునరావృతం కాకుండా ముందుచూపుతో ఆలోచించి, అంతర్జాతీయ స్థాయిలో నిపుణుల సేవలను తీసుకున్నారని తెలిపారు. ప్రఖ్యాత ఇంజినీర్ సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను నియమించి ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాల నిర్మాణం చేపట్టారని వివరించారు.

1920 నాటికి ఈ జలాశయాల నిర్మాణం పూర్తయిందని, వందేళ్లకు పైగా గడిచినా నేటికీ హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. ఆనాటి పాలకులు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తీసుకున్న నిర్ణయాలు నేటికీ ప్రజలకు ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు.

చారిత్రక కట్టడాలకు నిలయంగా ఒకప్పటి మూసీ

నిజాం పాలన కాలంలోనే వందేళ్ల క్రితం మూసీ నది పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేశారని ముఖ్యమంత్రి వివరించారు. మూసీ నది వెంట పురానాపూల్ వంతెన, సిటీ కాలేజీ, హైకోర్టు, ఉస్మానియా ఆసుపత్రి, బ్రిటిష్ రెసిడెన్సీ వంటి అనేక చారిత్రక కట్టడాలను నిర్మించారని తెలిపారు. ఆ ప్రాంతం ఒకప్పుడు వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా విలసిల్లిందన్నారు. అయితే అనంతర ప్రభుత్వాలు మూసీ నది పరిరక్షణకు తగినంత ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు నగరానికి జీవనాధారంగా ఉన్న మూసీ నది నేడు మురికికూపంగా మారిపోయిందని, చివరకు నది తన సహజ స్వరూపాన్ని కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని పేర్కొన్నారు.

మూసీ కాలుష్యంతో నల్గొండ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

మూసీ నదిలో పేరుకుపోయిన కాలుష్యం నల్గొండ జిల్లా ప్రజల పాలిట శాపంగా మారిందని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. నది కాలుష్యం కారణంగా అక్కడి ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తాను స్వయంగా ఆ ప్రాంతంలో పర్యటించి పరిస్థితులను పరిశీలించానని, రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నానని చెప్పారు.

నల్గొండ జిల్లాలో ఒకవైపు ఫ్లోరైడ్ సమస్య ప్రజలను వేధిస్తుండగా, మరోవైపు మూసీ కాలుష్యం వారిని తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. కాలుష్య నీటి ప్రభావంతో ప్రజల ఆరోగ్యం, వ్యవసాయం దెబ్బతింటున్నాయని వివరించారు. అక్కడి రైతులు తమ ప్రాంతంపై పాలకులు కక్ష కట్టి కాలుష్య నీటిని వదిలి తమ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

కొత్తగా పెళ్లైన జంటలు కూడా ఆ ప్రాంతంలో నివసించేందుకు భయపడే పరిస్థితులు ఉన్నాయని, పుట్టబోయే పిల్లల ఆరోగ్యంపై కాలుష్య ప్రభావం పడుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులకు శాశ్వత పరిష్కారం చూపాలంటే మూసీ నదిని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాల్సిందేనని స్పష్టం చేశారు.

సబర్మతీ, గంగా, యమునా నదుల తరహాలో అభివృద్ధి

దేశంలోని సబర్మతీ నది పరివాహక ప్రాంతంతో పాటు ఉత్తరప్రదేశ్‌లో గంగా నది, ఢిల్లీలో యమునా నది పరివాహక ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్న విషయాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ప్రపంచ చరిత్రను పరిశీలిస్తే నదుల పరివాహక ప్రాంతాల్లోనే నాగరికతలు అభివృద్ధి చెందాయని, అక్కడి నుంచే ఆర్థిక వ్యవస్థలు విస్తరించాయని వివరించారు. నదీ పరివాహక ప్రాంతాల అభివృద్ధి వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు పర్యాటకం, వ్యాపారాలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. దక్షిణ కొరియాలో నదీ పరివాహక ప్రాంతాలను అద్భుతంగా అభివృద్ధి చేసి, రోజులో 24 గంటల పాటు ఆర్థిక కార్యకలాపాలు జరిగేలా ఏర్పాటు చేసుకున్నారని ఉదాహరణగా పేర్కొన్నారు. హైదరాబాద్‌లో కూడా మూసీ నదిని ప్రక్షాళన చేసి, నగర ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. మూసీ ప్రక్షాళనతో కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా, నదీ పరివాహక ప్రాంతాల అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు.

బాధితులకు నూటికి నూరు శాతం అండగా ఉంటాం

మూసీ ప్రాజెక్టు అమలులో ఎవరైనా బాధితులు ఉంటే వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రాజెక్టు కారణంగా ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా చూస్తామని, బాధితులను నూటికి నూరు శాతం ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

మూసీ ప్రక్షాళన విషయంలో రాజకీయ నాయకులు తమ భేషజాలను పక్కనపెట్టి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ నగర భవిష్యత్తు, ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలను రాజకీయాలకు అతీతంగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. నగర అభివృద్ధి కోసం అందరూ ఒకే వేదికపైకి వచ్చి సహకరించాలని కోరారు.

మురికికూపంగా మారిన మూసీకి పూర్వ వైభవం

మూసీ నదిలో మనుషుల మృతదేహాలు, పశువుల కళేబరాలు, ఇతర వ్యర్థాలు చేరి నది పూర్తిగా మురికికూపంగా మారిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇది మానవ తప్పిదాలు, ప్రభుత్వాల వైఫల్యాల ఫలితమని అన్నారు. నదిలోకి చేరుతున్న కాలుష్యాన్ని అరికట్టి, నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించి, నదిని తిరిగి జీవనదిగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. మూసీ నది ప్రక్షాళన వల్ల హైదరాబాద్‌తో పాటు దిగువ ప్రాంతాల ప్రజలకు కూడా ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. అందుకే ఈ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యంతో చేపడుతున్నామని, తొలి విడత పనులను త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు.

తమ్మిడికుంట నిర్వహణలో మహిళా సంఘాలకు బాధ్యతలు

పునరుద్ధరించిన తమ్మిడికుంట చెరువును భవిష్యత్తులో కూడా ఇదే విధంగా పరిశుభ్రంగా, సుందరంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. నిర్వహణ సక్రమంగా లేకపోతే మళ్లీ చెరువు పూర్వపు దుస్థితికి చేరుకునే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల సైబరాబాద్ మున్సిపల్ కమిషనరేట్‌తో పాటు ఇందిరా మహిళా శక్తి సంఘాల మహిళలకు చెరువు నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని సూచించారు.

చెరువు పరిసరాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో చిన్నచిన్న వ్యాపారాలు నిర్వహించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని చెప్పారు. మహిళా శక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే దుకాణాల ద్వారా స్థానిక మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు చెరువు కేంద్రంగా చిన్నచిన్న ఆర్థిక కార్యకలాపాలు జరిగేలా చూడాలని సూచించారు. దీనిని 'చెరువు ఆధారిత ఆర్థిక వ్యవస్థ'గా అభివృద్ధి చేయాలన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు వేదికగా తమ్మిడికుంట

తమ్మిడికుంట చెరువు కేవలం పర్యాటక ప్రాంతంగానే కాకుండా మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడే కేంద్రంగా కూడా అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. గ్రామాల నుంచి నగరాలకు వచ్చి స్థిరపడిన ప్రజలు తమ పండుగలు, సంప్రదాయాలను కొనసాగించుకునేలా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దాలని సూచించారు.

దసరా, దీపావళి, సంక్రాంతి వంటి పండుగలను ప్రజలు ఇక్కడ సామూహికంగా జరుపుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ముఖ్యంగా దసరా సందర్భంగా జమ్మి చెట్టు పూజకు ప్రాధాన్యం ఉన్నందున చెరువు వద్ద ఒక జమ్మి చెట్టును నాటాలని అధికారులకు సూచించారు.

చెరువుల పునరుద్ధరణతో పర్యావరణానికి మేలు జరగడంతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం, మహిళలకు ఉపాధి, పిల్లలకు వినోదం, సమాజానికి సాంస్కృతిక వేదిక అందుబాటులోకి వస్తుందని ముఖ్యమంత్రి వివరించారు.

పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు

ప్రజాపద్దుల సంఘం చైర్మన్ ఆరెకపూడి గాంధీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సినీనటుడు అక్కినేని నాగార్జున విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, కుందూరు రఘువీర్ రెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షురాలు గద్వాల విజయలక్ష్మి, శాసనమండలి విప్ పట్నం మహేందర్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, హైడ్రా కమిషనర్ రంగనాథ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతుల కష్టాలు పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం: కేటీఆర్



నిర్మల్, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణలో నెలకొన్న కరువు పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం స్పందించడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. నిర్మల్‌లో నిర్వహించిన రైతు గర్జన సభలో ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమాన్ని పక్కనపెట్టి రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. రైతులకు ధైర్యం చెప్పాల్సిన ముఖ్యమంత్రి గ్రామాల్లో నాటకాలు వేయాలని సూచించడం ఏమిటని ప్రశ్నించారు. రైతుల కష్టాలపై దృష్టి పెట్టకుండా తన గడ్డం గురించి ముఖ్యమంత్రి ఆందోళన చెందుతున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించి కేసీఆర్‌ను తిరిగి గెలిపించుకోవాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు.

కరువు కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు తగ్గిపోయి కూలీలు ఉపాధి కోల్పోతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పనులు లేక ఇబ్బందులు పడుతున్న ప్రతి వ్యవసాయ కూలీకి నెలకు రూ.వెయ్యి చొప్పున 36 నెలలకు మొత్తం రూ.36 వేలు ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు వెంటనే నాలుగు విడతల రైతుబంధు నిధులు విడుదల చేయాలని కోరారు. కరువు పరిస్థితుల్లో రైతులు తీసుకున్న బ్యాంకు రుణాలను రీషెడ్యూల్ చేయడంతో పాటు ఇంకా పెండింగ్‌లో ఉన్న రుణమాఫీని పూర్తిచేయాలని సూచించారు. రైతులకు సాగునీరు, విద్యుత్ అందిస్తామనే భరోసా కూడా ప్రభుత్వం ఇవ్వడం లేదని విమర్శించారు.

రైతుబంధు, రైతుబీమా పథకాల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. యూరియా కొరత, ధాన్యం కొనుగోళ్ల సమస్యలు, పంటలకు బోనస్ హామీ అమలుకాకపోవడం వంటి అంశాలను ప్రస్తావించారు. విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సాగునీటి ప్రాజెక్టుల విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయని, కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయ కక్షతో పక్కనపెట్టారని ఆరోపించారు. గోదావరి, కృష్ణా నదుల్లో తెలంగాణకు దక్కాల్సిన నీటిని సమర్థంగా వినియోగించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని వ్యాఖ్యానించారు. ప్రకృతి వల్ల వచ్చిన కరువు కంటే పాలకుల వైఫల్యాలే రాష్ట్రంలో నీటి సమస్యను పెంచాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వంపైనా కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణలో ఓట్లు, సీట్లు కావాలని కోరుతున్న బీజేపీ నాయకులు రాష్ట్రానికి నిధులు తీసుకురావడంలో ఎందుకు విఫలమవుతున్నారని ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోదీ మనసులో తెలంగాణకు స్థానం లేదా అని నిలదీశారు. రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు తీసుకురావడంలో చిత్తశుద్ధి ఉంటే బీజేపీ నాయకులు ప్రధాని నివాసం ఎదుట ధర్నా చేయాలని సవాల్ విసిరారు. ఆదిలాబాద్‌లోని సీసీఐ ఫ్యాక్టరీ, నిర్మల్‌కు మంజూరుకావాల్సిన నవోదయ విద్యాలయం అంశాలను ప్రస్తావిస్తూ కేంద్రం నుంచి జిల్లాకు తగిన ప్రయోజనాలు అందడం లేదని ఆరోపించారు. పొరుగు రాష్ట్రాలకు కరువు బృందాలు వెళ్తున్నప్పటికీ తెలంగాణలోని పరిస్థితులను కేంద్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, యువత, మహిళలు, దళితులు సహా వివిధ వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో అప్పులు పెరుగుతున్నప్పటికీ సంక్షేమ పథకాలకు నిధులు అందడం లేదని విమర్శించారు. పాలమూరు ప్రాజెక్టు, కాళేశ్వరం, సదర్‌మాట్ బ్యారేజీ, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల నీటి వినియోగంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాజెక్టులకు నీరు అందుతుంటే తెలంగాణలోని గోదావరి పరివాహక ప్రాంతమైన నిర్మల్‌లో కరువు పరిస్థితులు ఎందుకు నెలకొన్నాయని నిలదీశారు. ఈ సభలో నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి రామ్‌కిషన్ రెడ్డి, మాజీ మంత్రులు జోగు రామన్న, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో హైదరాబాద్‌కు రాష్ట్రస్థాయి గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

పరిశుభ్రంగా, పచ్చదనంతో, పర్యావరణహితంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ఈ గుర్తింపు మరింత ప్రోత్సాహాన్నిస్తుందని పేర్కొన్నారు.

స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్‌లో హైదరాబాద్‌కు ఈ గుర్తింపు లభించింది. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ, ఘన వ్యర్థాల శుద్ధి, మురుగునీటి నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలను ప్రాతిపదికగా తీసుకుని జీహెచ్ఎంసీ ఈ పురస్కారానికి ఎంపికైంది.

ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వారికి ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

హైదరాబాద్‌ను హరిత నగరంగా, నెట్‌జీరో నగరంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో వివిధ ప్రమాణాల ఆధారంగా నగరానికి ఈ గుర్తింపు లభించడం హైదరాబాద్‌తో పాటు తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని అన్నారు. నగరంలో పరిశుభ్రతను మరింత పెంపొందించేందుకు ప్రభుత్వ యంత్రాంగం, ప్రజలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

ఈ పురస్కారం సాధించడంలో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు నిరంతరం అంకితభావంతో చేస్తున్న కృషి అభినందనీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రతిరోజూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలకు ఈ పురస్కారం గుర్తింపుగా నిలుస్తుందని తెలిపారు. ఇది వారి సమష్టి కృషికి దక్కిన గౌరవమని అభివర్ణించారు. హైదరాబాద్‌లో పారిశుద్ధ్య ప్రమాణాలను మరింత మెరుగుపరచడం, పట్టణ పరిశుభ్రతను పెంపొందించడం, పచ్చదనాన్ని విస్తరించడం ద్వారా నగరాన్ని పరిశుభ్రమైన, పర్యావరణహితమైన, సుస్థిర నగరంగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో లభించిన ఈ గుర్తింపు భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు అధికారులకు, సిబ్బందికి ప్రోత్సాహకంగా నిలుస్తుందని తెలిపారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
గురువారం - 12 - నవంబర్ 2026
వరంగల్ 03

మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు ఘన నివాళులు



- **నగరపాలక సంస్థ కార్యాలయంలో జయంతి వేడుకలు**
- **విద్యారంగ అభివృద్ధికి ఆయన సేవలు చిరస్మరణీయం: మేయర్ కొలగాని శ్రీనివాస్**

కరీంనగర్, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు): భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు కరీంనగర్ నగర పాలక సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, పలువురు కార్పొరేటర్లు పాల్గొని మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. స్వతంత్ర భారతదేశ నిర్మాణంలో ఆయన చేసిన కృషి, దేశంలో విద్యా వ్యవస్థ పునాదులను బలోపేతం చేసేందుకు చేపట్టిన కార్యక్రమాలు చిరస్మరణీయమని కొనియాడారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని విశ్వసించిన ఆయన, ప్రతి ఒక్కరికీ విద్య అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో కృషి చేశారని తెలిపారు.

దేశ భవిష్యత్తు యువత, విద్యార్థుల చేతుల్లో ఉంటుందని భావించి విద్యా రంగ అభివృద్ధికి విశేష ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. దేశంలో ఉన్నత విద్య, సాంకేతిక విద్య, పరిశోధన రంగాల అభివృద్ధికి ఆయన వేసిన పునాదులు నేటికీ ఎంతో ప్రాధాన్యత కలిగి ఉన్నాయని అన్నారు.

మహనీయుల ఆశయాలు, సేవలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని విద్యలో రాణిస్తూ దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థకు చెందిన పలువురు కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లో సీసీ రోడ్ల పనులను పరిశీలించిన డిప్యూటీ మేయర్ సునీల్ రావు



- **నాణ్యతతో, మన్నికగా నిర్మించాలని అధికారులకు సూచనలు**

కరీంనగర్, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు): అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా బుధవారం డివిజన్‌లో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

రోడ్ల నిర్మాణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ చాలా కాలం పాటు మన్నికగా ఉండేలా పనులు చేపట్టాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన, అందమైన సీసీ రోడ్లను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, డివిజన్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా జ్యోతిబా ఫూలే గురుకులంలో స్పోర్ట్స్ డే



- **విద్యార్థినులతో కలిసి వాలీబాల్ ఆడిన ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ**

మానకొండూర్, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు): మానకొండూర్ నియోజకవర్గ పరిధిలోని తిమ్మాపూర్ మండల కేంద్రంలో ఉన్న మహాత్మా జ్యోతిబా ఫూలే బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన స్పోర్ట్స్ డే కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన క్రీడా కార్యక్రమాలను ప్రారంభించి విద్యార్థినులకు ఆశీర్వచనం అందించారు. క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా బాలికలు క్రీడల్లో పాల్గొనడం వల్ల ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, ఆరోగ్యం పెంపొందుతాయని సూచించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలల్లో విద్యతోపాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమం అనంతరం డా. కవ్వంపల్లి సత్యనారాయణ విద్యార్థినులతో కలిసి వాలీబాల్ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. విద్యార్థినులతో సమానంగా క్రీడల్లో పాల్గొని వారిని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణ, విద్యార్థినుల ప్రతిభ, సాధనలపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

చదువుతో పాటు పౌష్టికాహారం.. గోపాలపూర్‌లో ఉచిత అల్పాహార కార్యక్రమం ప్రారంభం!

ఎల్కతుర్తి, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు): ఎల్కతుర్తి మండలం గోపాలపూర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఉచిత అల్పాహారం అందించే కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందించి, ప్రజాప్రతినిధులు, అధికారులు విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించారు.

విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం, విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు చదువుపై ఆసక్తి, ఏకాగ్రత పెరిగేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు.

ఇలాంటి ఉపయోగకరమైన కార్యక్రమాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి గోపాలపూర్ గ్రామ ప్రజల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్రె లక్ష్మి, ఉప సర్పంచ్ మారుపాక సందీప్, జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు కిషన్ రావు, ఎంపీపీఎస్ బస్టాండ్ ప్రధానోపాధ్యాయులు సదానందం, గ్రామ పంచాయతీ కార్యదర్శి మిల్కూరి గణపతి, వార్డు సభ్యులు శ్రీపతి లావణ్య, జూపాక సంధ్యారాణి, వల్లెపు స్వప్న, పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తూ వారి ఆరోగ్యానికి, ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసే ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగాలని గ్రామ ప్రజాప్రతినిధులు ఆకాంక్షించారు.

వంగరలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం



- **రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం.. మద్దతు ధరను రైతులు సద్వినియోగం చేసుకోవాలి: సర్పంచ్ గజ్జెల సృజన రమేష్**

భీమదేవరపల్లి, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు): హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలోని రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ గజ్జెల సృజన రమేష్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభించేలా కొనుగోలు కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే ధాన్యాన్ని విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని, రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందించడంలో గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ ముందుంటుందని సర్పంచ్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోచంపల్లి రాజిరెడ్డి, బొక్కల ప్రవంతి, పూస కోయిల ప్రకాష్, మొండయ్య, రమేష్, సతీష్, శారద, అశోక్, చింతరాజు, జక్కుల అనిల్, వెంకటేష్, వ్యవసాయ శాఖ ఏఓ, ఏఈఓ, గ్రామ కార్యదర్శి, సీసీ సదానందం, సీఏలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భూమి హక్కుల కోసం సమరశంఖం.. దళితుల భూముల పరిరక్షణకు రాష్ట్రవ్యాప్త పోరు!



- **డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్**

ఎల్కతుర్తి నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు): దళిత పేదలకు ప్రభుత్వం గతంలో పంపిణీ చేసిన అసైన్డ్ భూములకు సంపూర్ణ యాజమాన్య హక్కులు కల్పించాలని, అభివృద్ధి, పరిశ్రమల పేరుతో దళితుల సాగు భూములను స్వాధీనం చేసుకునే చర్యలను తక్షణమే నిలిపివేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్రప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ డిమాండ్ చేశారు.

దళిత హక్కుల పోరాట సమితి హనుమకొండ జిల్లా సమితి సమావేశం జిల్లా అధ్యక్షుడు రాజారపు రత్నం అధ్యక్షతన బుధవారం స్థానిక బాలసముద్రంలోని జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ.. దళిత పేదలకు భూములు పంపిణీ చేసి వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి పునాది వేయాల్సిన ప్రభుత్వం, మరోవైపు వివిధ ప్రాజెక్టులు, పరిశ్రమల పేరుతో అదే భూములను తిరిగి స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేయడం ఆందోళనకరమని అన్నారు. భూమి కేవలం ఆస్తి మాత్రమే కాదని, దళిత పేదల జీవనాధారమని, వారి ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. దశాబ్దాలుగా అసైన్డ్ భూములను సాగు చేసుకుంటున్న రైతులకు సంపూర్ణ హక్కులు కల్పించకుండా అనేక ఆంక్షలతో ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమన్నారు. అసైన్డ్ భూములపై సాగుదారులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించేలా ప్రభుత్వం సమగ్ర విధానాన్ని ప్రకటించాలని కోరారు. ప్రభుత్వం గతంలో పంపిణీ చేసిన అసైన్డ్ భూముల వివరాలు, ప్రస్తుతం సాగులో ఉన్న రైతుల స్థితిగతులపై జిల్లా వారీగా సమగ్ర సర్వే నిర్వహించి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దళితులకు కేటాయించిన భూములను ఇతర అవసరాలకు మళ్లించే ముందు బాధిత రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని, చట్టబద్ధమైన పరిహారం, పునరావాసం కల్పించకుండా భూములను స్వాధీనం చేసుకోరాదని స్పష్టం చేశారు.

దళితుల భూముల పరిరక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని, జిల్లా, మండల, గ్రామస్థాయిలో భూ సమస్యలపై పోరాటాలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. దళితుల భూముల పరిరక్షణతో పాటు అసైన్డ్ భూములకు సంపూర్ణ హక్కుల సాధన కోసం ప్రజాస్వామిక శక్తులు, దళిత సంఘాలు, భూమిలేని పేదలు ఐక్యంగా ఉద్యమించాలని మారుపాక అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీకేఎంయస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి నిమ్మల మనోహర్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కొట్టే పాక రవి, నాయకులు పద్మ, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంటలో గ్రామీణ యువతకు ఉచిత ఏఐ శిక్షణ కేంద్రం

- **గ్రామీణ యువతకు ఉచిత ఏఐ శిక్షణ అందించడమే లక్ష్యం**

ఇల్లందకుంట, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు): రాబోయే ఐదు సంవత్సరాల్లో విద్య, వ్యవసాయం, వైద్యం సహా అన్ని రంగాల్లో కృత్రిమ మేధస్సు (ఏఐ) ద్వారా విప్లవాత్మక మార్పులు చోటుచేసుకోనున్నాయని యాప్ టీవీ అధినేత ఉదయానంద రెడ్డి అన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా గ్రామీణ ప్రాంత యువతకు సైతం ఏఐపై అవగాహన, నైపుణ్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఇల్లందకుంట మండల కేంద్రంలో ఉచిత ఏఐ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆరో తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి ఉన్నత విద్యను అభ్యసిస్తున్న యువత వరకు ఈ కేంద్రంలో ఉచితంగా ఏఐ శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. పట్టణ ప్రాంతాల విద్యార్థులకు మాత్రమే కాకుండా గ్రామీణ ప్రాంతాల యువతకు కూడా ఆధునిక సాంకేతిక విద్య అందుబాటులో ఉండాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

గతంలో వీణవంక మండల కేంద్రంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి పలువురు యువతకు ఉద్యోగ అవకాశాలు పొందేందుకు సహకరించినట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో హుజూరాబాద్ కేంద్రంగా కూడా ఉచిత ఏఐ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

గ్రామీణ యువత సాంకేతిక రంగంలో ముందంజ వేయడంతో పాటు భవిష్యత్తులో అందుబాటులోకి వచ్చే ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఉదయానంద రెడ్డి వివరించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

నేడు వెల్టూర్‌లో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం

- **ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఎమ్మెల్యే మేఘా రెడ్డి**



పెద్దమందడి,నవంబర్11(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి జిల్లా పెద్దమంద డి మండలంలోని వెల్టూర్ గ్రామంలో మండలమహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐకేపీ వరి కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించను న్నట్లు పెద్దమందడి మండల ఏపీఎం సక్రు నాయక్ తెలిపారు. ఈ ప్రారంభో త్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే మేఘా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నా రని పేర్కొన్నారు.గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మండ లంలోని అధికారులు, ప్రజాప్రతినిధు లు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రముఖ లు, పత్రికా మిత్రులు మరియు రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని వి జయవంతం చేయాలని ఏపీఎం సక్రు నాయక్ కోరారు.

బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తున్న వైన్ షాపులపై చర్యలు తీసుకోవాలి


- **నిబంధనలు ఉల్లంఘిస్తున్న షాపుల లైసెన్సులు రద్దు చేయాలి**



జమ్మికుంట, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు): జమ్మికుంట, ఇల్లంద కుంట మండలాల పరిధిలోని వైన్ షాపుల నుంచి బెల్ట్ షాపులకు అక్ర మంగా మద్యం సరఫరా చేస్తున్న యా జమాన్యాలపై తక్షణమే చర్యలు తీసు కోవాలని పీడీఎస్‌యూ జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జమ్మికుంట ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో అధికారులకు వి నతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర కోశాధికారి, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు అంగిడి కుమార్ మాట్లాడుతూ జమ్మి కుంట పట్టణం, మండలంతో పాటు ఇల్లందకుంట మండల పరిధిలోని పలు వైన్ షాపుల నుంచి బెల్ట్ షాపులకు విచ్చలవిడిగా మద్యం సరఫరా చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు సాగిస్తున్నారని ఆరోపించారు. పరిమిట్ రూముల పరిధిని మించి బార్లను తల పించేలా నిర్వహిస్తున్నారని, లైసెన్స్ ఒకరి పేరు మీద ఉండగా మరొకరు వైన్ షాపులను నిర్వహిస్తున్నారనే ఆరో పణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్న వైన్ షాపుల యాజమాన్యాలపై ఎక్సైజ్ అధికారులు సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తు న్నట్లు తేలిన వైన్ షాపుల లైసెన్సులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అధి కారులు స్పందించి చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేప డతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి లోకి, జిల్లా ఉపాధ్యక్షులు వెల్ది రాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యం

- **ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

వనపర్తి,నవంబర్11(తెలంగాణ ముచ్చట్లు): ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని అభివృద్ధి పనులతో నిలబె ట్టుకుంటానని, నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించ డమే తన లక్ష్యమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పెద్ద జీతగాడిలా పనిచేస్తానని పేర్కొ న్నారు.బుధవారం ఏదుల రిజర్వాయ ర్ నుంచి డీ5 కాలువ ద్వారా ఏదుల, అనంతపురం గ్రామాల చెరువులకు నీటిని విడుదల చేశారు. తన ప్రత్యేక చొరవతో, సొంత నిధులతో అవసర మైన పనులు చేపట్టించి చెరువులకు నీరు చేరేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రైతులకు సాగునీటి ఇబ్బం దులు లేకుండా ఇరిగేషన్ అధికారులు డ్యామ్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తూ నీటిని విడుదల చేయాలని సూచిం చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మా ట్లాడుతూ, కరువు పేరుతో బీఆర్ఎస్ నాయకులు ప్రజలను భయభ్రాంతు లకు గురిచేస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గతంలో ఏదుల రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు సరైన పరిహారం అందించలేని వారు నేడు పరిహారం గురించి మాట్లాడటం విడ్డూ రమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధి కారంలోకి వచ్చిన తర్వాతే పెండింగ్ పరిహారం అందించామని తెలిపారు. ఏదుల, కొంకలపల్లి, బండరావిపా కుల తదితర గ్రామాల సమగ్ర అభివృ ద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాను కూలంగా స్పందించారని చెప్పారు. రైతుల సంక్షేమం, సాగునీరు, గ్రామా ల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలు తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తానని స్పష్టం చేశా రు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు అధ్యక్షుడు వెంకటేష్, ఉపాధ్యక్షుడు సత్యశీలారెడ్డి, మండల అధ్యక్షుడు సుఖేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, గ్రామస్థులు పా ల్గొన్నారు.





ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

- **దళారుల చేతుల్లో మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి**

వేలేరు, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ సక్రమంగా జరగాలని, అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదే శించారు. రైతులకు నష్టం జరగకుండా ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు.

అనంతరం వేలేరు రైతు వేదికలో నిర్వహిం చిన కార్యక్రమంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి చెక్కులను పంపిణీ చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నా రు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో ప్రతి నెలా సుమారు రూ.3 కోట్ల మేర సీఎం సహాయనిధి ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వేలేరు సర్పంచ్ బిల్లా యాదగిరి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మురావత్ లక్ష్మణ్ నాయక్, తహశీల్దార్ కోమి, ఏఓ అనిత, ఎంపీడీఓ కిషన్ నాయక్, వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.





జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ఇల్లందకుంటలో వ్యాసరచన పోటీలు

- **ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం**

ఇల్లందకుంట, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు): జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇల్లందకుంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో బుధవారం మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. విద్య యొక్క ప్రా ముఖ్యత అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల కు ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ గంగిశెట్టి జగ దీశ్వర్, మండల విద్యాధికారి కె. రాములు నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తస్లీమ్ నజ్మీన్ చేతుల మీదుగా బహుమతు లు అందజేశారు.

ఈ సందర్భంగా మండల విద్యాధికారి కె. రాములు నాయక్, ప్రధానోపాధ్యాయురాలు తస్లీమ్ నజ్మీన్ మాట్లాడుతూ విద్య మనిషికి నిజమైన బలమని, జ్ఞానార్జనతో దేశ పురోగ తికి, సమాజ అభివృద్ధికి కృషి చేయవచ్చని అన్నారు. తలవంచి పుస్తకం చదివితే అదే పుస్తకం మనల్ని తలెత్తుకుని జీవించేలా చే స్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవడంతో పాటు పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ గంగిశెట్టి జగ దీశ్వర్ మాట్లాడుతూ 2011 సంవత్సరం నుంచి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్‌ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు,సమాజం లోని పేదలకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ నాయకుల జయంతి, వర్ధంతి సందర్భంగా వ్యాసరచన, క్రీడలు, ప్రతిభా పోటీలు నిర్వహిస్తూ వారి ఆశయాలను విద్యార్థులకు పరిచయం చేస్తు న్నట్లు వివరించారు.

మండల స్థాయి పోటీల్లో ప్రథమ బహుమ తులు సాధించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇల్లందకుంటకు చెందిన ఎం. రచన, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాల యం, ఇల్లందకుంటకు చెందిన పి. నాగల క్ష్మికి శంకర్ నారాయణ డిక్షనరీలతో పాటు మెమెంటోలు అందజేశారు. కన్సోలేషన్ బహుమతులుగా బి. రక్షిత, ఎం. అక్షయ్, ఎం. సహస్ర, కె. రితిక్, డి. కావ్యశ్రీ, బి. నితిన్,ఎం.అక్షయ్,డి.రితికలకు డిక్షనరీలు అందించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయు లు కె.జయప్రకాష్,సీహెచ్.వేణు,కె.సత్యం, జె. రాధికారాణి, మండల ఉపాధ్యాయులు ఎస్. అనసూయ, ప్రేమ్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

దళితుల భూములు తిరిగి అప్పగించకుంటే.. కేసీఆర్, కేటీఆర్ భూములను స్వాధీనం చేసుకుంటాం

- **డాక్టర్ పిడమర్తి రవి హెచ్చరిక**
- **నవంబర్ 29న హైదరాబాద్‌లో కార్తీకమాస వనభోజనాలు**



హైదరాబాద్, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రాష్ట్రంలో దళితులు తరతరాలుగా సాగు చేసుకుంటూ అనుభవి స్తున్న ఇనాం, అసైన్డ్ భూములను గత ప్రభు త్వ పెద్దలు అక్రమంగా కబ్జా చేశారని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ పిడమర్తి రవి ఆరో పించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీ ఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు గుంతకల్లు జగదీశ్వర్‌రెడ్డి, నిరం జన్‌రెడ్డి తదితరులు దళితుల భూములను ఆక్రమించుకున్నారని విమర్శించారు.

ఈ భూములపై సమగ్ర సర్వే నిర్వహించి నెల రోజుల్లోగా తిరిగి దళితులకు అప్పగి స్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఆ హామీ అమలుకు నోచుకో లేదని అన్నారు. తక్షణమే భూములను సర్వే చేసి బాధిత దళితులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రంలోని అన్ని దళిత సంఘాలను ఏకతాటిపైకి తీసు కొచ్చి, సంబంధిత భూముల వద్దకు వెళ్లి దళితుల భూములను దళితులే స్వాధీనం చేసుకుని పంచుకుంటామని హెచ్చరించా రు.

నవంబర్ 29న కార్తీకమాస వనభోజనాలు


కార్తీకమాస వనభోజనాలను నవంబర్ 29న హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు డాక్టర్ పిడమర్తి రవి వె ల్లడించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక మం కొనసాగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని పేర్కొ న్నారు. విశిష్ట అతిథులుగా రాష్ట్ర శాసనస భ్యులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొం టారని తెలిపారు. మాదిగ ఉపకులాలకు చెందిన కవులు, కళాకారులు, విద్యార్థులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పా ల్గొననున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గద్ద యాదయ్య, జాతీయ దళిత సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు భూదాల బాబురావు, దళిత బహుజన సమితి రాష్ట్ర అధ్యక్షుడు గజ్జల మల్లికార్జున్, బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్, మాదిగ యూత్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నక్క మహేష్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు జెర్రిపోతుల సాయన్న, దేవరకొండ నరేష్, విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు జోగు గణేష్, నక్క రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగరాలి.. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి

- **ప్రతిపక్షాల విషప్రచారాన్ని ప్రజాక్షేత్రంలో తిప్పికొట్టాలి**

వేలేరు, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే అసలైన బలమని, ప్రతి కార్యకర్త ప్రజ లతో మమేకమై ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. గ్రా మాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతూ పార్టీ పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ విజ యకేతనం ఎగురవేసేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయా లని పిలుపునిచ్చారు. ప్రతిపక్షాలు చేసే అనవసర ఆరోపణలు, విషప్రచారాలకు భయపడకుండా వాస్తవాలను ప్రజలకు వివరించాలని, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని దిశాని ర్దేశం చేశారు. ఈ సమావేశంలో వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్య క్షుడు మురవత్ లక్ష్మణ్ నాయక్, కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల పార్టీ కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
గురువారం - 12 - నవంబర్ 2026
వరంగల్ 05

జమ్మికుంటలో ఈ నెల 15న ఉచిత మెగా వైద్య శిబిరం



- **మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ఆధ్వర్యంలో నిర్వహణ**

జమ్మికుంట, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు): జమ్మికుంట పట్టణ ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఈ నెల 15వ తేదీన ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రం లోని అంజలి కిడ్నీ కేర్ సెంటర్ సహకారంతో పట్టణ పరిధిలోని బాలికల పాఠశాలలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ గీతాంజలి నరేష్ (యూరాలజిస్ట్, యూరో గైనకాలజిస్ట్, కిడ్నీ సర్జన్), డాక్టర్ నరేష్ సముద్రాల (ఫ్యామిలీ ఫిజీషియన్, డయాబెటాలజిస్ట్) వైద్య సేవలు అందించనున్నారు.

కిడ్నీ సంబంధిత సమస్యలు, మూత్ర సంబంధిత వ్యాధులు, మహిళల ఆరోగ్య సమస్యలు, మధుమేహం తదితర ఆరోగ్య సమస్యలపై వైద్యుల సలహాలు, పరీక్షలు పొందేందుకు ఈ శిబిరం ఉపయోగపడనుంది.

పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పెద్ద సంఖ్యలో పాల్గొని ఉచిత వైద్య సేవలు పొందాలని నిర్వాహకులు కోరారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం స్ఫూర్తిదాయకం



- **స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. శ్రీజ**
- **ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు**

ఖమ్మం బ్యూరో , నవంబర్ - 11 (తెలంగాణ ముచ్చట్లు): స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం స్ఫూర్తిదాయకమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మౌలానా అబుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఆజాద్ విద్యా రంగానికి చేసిన సేవలు, ఆయన ఆలోచనలు, పోరాట పటిమ ప్రతీ ఒక్కరికీ ఆదర్శనీయమని కొనియాడారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆజాద్, స్వతంత్ర భారత తొలి విద్యా శాఖ మంత్రిగా దేశ విద్యా వ్యవస్థకు బలమైన పునాదులు వేశారన్నారు. ఐఐటీ, ఐఐఎస్సీ, యూజీసీ, సాహిత్య అకాడమీ వంటి ప్రతిష్టాత్మక సంస్థల ఏర్పాటులో అబుల్ కలాం ఆజాద్ పాత్ర మరవరానిదని తెలిపారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు, సమగ్ర అభివృద్ధి సాధ్యమని ఆజాద్ అన్నారని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్. రామ్మూర్తి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహ్మద్ ముజాహిద్, జిల్లా పశు సంవర్ధక అధికారి డా. పురందర్, జిల్లా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని అబుల్ కలాం ఆజాద్‌కి నివాళులర్పించారు.

మత్తు రహిత తెలంగాణ ఉద్యమాన్ని గ్రామస్థాయికి తీసుకెళ్లాలి



- **పలుస శంకర్ గౌడ్, జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు**

వనపర్తి,నవంబర్11(తెలంగాణ ముచ్చట్లు): మత్తు రహిత తెలంగాణ రాష్ట్ర కన్వీనర్‌గా నియమితులైన పోచ రవీందర్ రెడ్డిని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ, పోచ రవీందర్ రెడ్డి నియామకం తెలంగాణ యువతకు శుభపరిణామని అన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. మత్తు రహిత తెలంగాణ లక్ష్యంగా ఈ ఉద్యమాన్ని రాష్ట్రంలోని ప్రతి గ్రామం, పట్టణానికి విస్తరించాలని పిలుపునిచ్చారు.యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ చదువు, క్రీడలు, సంస్కృతి వైపు దృష్టి సారించాలని సూచించారు.ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో సాహితీ కళా వేదిక సభ్యులు బండారు శ్రీనివాస్, జి.జె. శ్రీనివాస్, వెంకట రమణ, రాజు, భరత్ కుమార్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.





ఖమ్మం టౌన్ ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్

ఖమ్మం బ్యూరో, నవంబర్ 11(తెలంగాణ ముచ్చట్లు): ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీస్ పరిపాలనను మరింత పటిష్టం చేయడం, విధుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఖమ్మం టౌన్ ఏసీపీ కార్యాలయాన్ని బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయం లోని వివిధ రికార్డులు, కేసుల వివరాలు, నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతి, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, పోలీస్ స్టేషన్ల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులకు పలు సూచనలు చేస్తూ, కేవలం కార్యాలయ స్థాయిలోనే కాకుండా క్షేత్రస్థాయిలోనూ పోలీస్ స్టేషన్ వారీగా సమగ్ర సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితి, నేరాల తీరు, పెండింగ్ కేసులు, ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదుల పరిష్కారంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు నేర నియంత్రణ, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసుల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు. అనంతరం ఏసీపీ కార్యాలయ ఆవరణలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని చాటిచెప్పారు. కార్యక్రమంలో ఏసీపీ రమణమూర్తి, ఇన్స్పెక్టర్లు సాధిక్ పాషా, రామకృష్ణ, చిట్టిబాబు,నాగరాజు కరుణాకర్ పాల్గొన్నారు.

మద్దతు ధరకు తగ్గకుండా ధాన్యం కొనుగోలు చేయాలి...

- **జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్**

ఖమ్మం బ్యూరో , నవంబర్ - 11(తెలంగాణ ముచ్చట్లు): మద్దతు ధరకు తగ్గకుండా ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్ వ్యాపారులు, రైస్ మిల్లర్లను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ ఆదేశాల మేరకు సత్తుపల్లి, తల్లాడ, కల్లూరు మండలాలకు చెందిన ధాన్యం వ్యాపారులు, రైస్ మిల్లర్లతో సత్తుపల్లి మిల్ పాయింట్ వద్ద జిల్లా పౌరసరఫరాల అధికారి గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల అధికారి మాట్లాడుతూ, రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు ఏమాత్రం తగ్గకుండా చెల్లించాలని స్పష్టం చేశారు. సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర రూ. 2,481 తో పాటు, ప్రభుత్వం అందించే బోనస్ రూ. 500 కలిపి మొత్తం రూ. 2,981 చెల్లించాలన్నారు. దొడ్డురకం ధాన్యానికి క్వింటాలుకు కనీస మద్దతు ధర రూ. 2,461 చెల్లించాలనీ తెలిపారు. కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయరాదని, వీలైతే రైతులకు అండగా నిలుస్తూ మద్దతు ధర కంటే ఎక్కువ ధర చెల్లించి ధాన్యం కొనుగోలు చేయాలని వ్యాపారులు, మిల్లర్లకు సూచించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి రైతులను నష్టపరిచే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల అధికారి హెచ్చరించారు. రైతులు కూడా తమ ధాన్యాన్ని కనీస మద్దతు ధర లేదా అంతకంటే ఎక్కువ చెల్లించే వ్యాపారులకే విక్రయించాలని విజ్ఞప్తి చేశారు.



బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు

- **ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు ఘన నివాళులు**

ఖమ్మం బ్యూరో, నవంబర్ 11(తెలంగాణ ముచ్చట్లు): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో భారతదేశ తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ విద్యావేత్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి లింగంనేని నళినిశ్రీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది, అధ్యాపకులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



అనంతరం ప్రిన్సిపాల్ శ్రీమతి నళినిశ్రీ మాట్లాడుతూ, భారతదేశ విద్యారంగ అభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ విశేష కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా దేశ విద్యావ్యవస్థ పటిష్టతకు బలమైన పునాదులు వేశారని తెలిపారు. విద్య అనేది కేవలం ఉద్యోగ సాధనకే పరిమితం కాకుండా వ్యక్తిత్వ వికాసానికి, సమాజ అభివృద్ధికి, దేశ పురోగతికి దోహదపడే శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను అలవర్చుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎ. మోహన్, అధ్యాపకులు జోసతాన్ బాబు, లక్ష్మీ కాంతం, పద్మావతి, రామకృష్ణ, రమేష్, రాజేంద్ర, ప్రియకుమార్ రెడ్డి, మురళీకృష్ణ, యశోద, శాంతిప్రియ, యూడీసీ మదర్ సాహెబ్, జశ్వంత్, బుజ్జమ్మ, అరుణ తదితరులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం..

- **చట్ట నిబంధనలు పక్కాగా అమలు చేయాలి**
- **జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, జిల్లా సలహా కమిటీ అధ్యక్షుడు డాక్టర్ డి. రామారావు**

ఖమ్మం బ్యూరో, నవంబర్ 11(తెలంగాణ ముచ్చట్లు): భ్రూణ లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టేందుకు జిల్లావ్యాప్తంగా పీసీ పీఎన్‌డీటీ చట్ట నిబంధనలను కఠినంగా అమలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, జిల్లా సలహా కమిటీ అధ్యక్షుడు డాక్టర్ డి. రామారావు అధికారులను ఆదేశించారు.

బుధవారం ఖమ్మం కలెక్టరేట్‌లోని ప్రగతి సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన జిల్లా సలహా కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామారావు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య పరీక్షా కేంద్రాలు, స్కానింగ్ కేంద్రాలు చట్ట నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నమోదు పత్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు ప్రతి స్కానింగ్ కేంద్రంలో గర్భిణులకు సంబంధించిన వివరాలను నిర్దేశిత నమూనా పత్రం (ఫామ్ఎఫ్)లో సక్రమంగా నమోదు చేయడంతోపాటు, ఆ వివరాలను ఎప్పటికప్పుడు అంతర్జాలంలో నమోదు చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో కొత్త అనుమతుల కోసం ఆరు దరఖాస్తులు రాగా, వాటిలో రెండింటికి తనిఖీలు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన నాలుగు దరఖాస్తుల్లో రెండు కేంద్రాలకు నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందన రాలేదని, ఒక కేంద్రానికి జరిమానా విధించామని, మరో కేంద్రం అంతర్జాలంలో దరఖాస్తు సమర్పించలేదని వివరించారు. అనుమతుల పునరుద్ధరణ కోసం మరో ఆరు దరఖాస్తులు అందినట్లు వెల్లడించారు.



స్కానింగ్ కేంద్రాలపై నిరంతర తనిఖీలు

జిల్లావ్యాప్తంగా నమోదైన అన్ని స్కానింగ్ కేంద్రాలను కమిటీ సభ్యులు, వైద్యాధికారులు నిరంతరం తనిఖీ చేయాలని, అక్కడి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. భ్రూణ లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడే కేంద్రాలపై నేరపరమైన కేసులు నమోదు చేయడంతోపాటు, వాటి అనుమతులను రద్దు చేస్తామని స్పష్టం చేశారు.

ఆడపిల్లల సంరక్షణ, బాలికల నిష్పత్తి మెరుగుదల లక్ష్యంగా 'ఆడపిల్లను కాపాడండి.. ఆడపిల్లను చదివించండి' కార్యక్రమ స్ఫూర్తితో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. భ్రూణ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వేణు మాధవరావు, కార్యక్రమ అధికారులు డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ అరుణాదేవి, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సహ ఆచార్యురాలు డాక్టర్ రాధిక, భారత వైద్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ హరి ప్రసాద్, జాగృతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు కుముదిని, జిల్లా సలహా కమిటీ సభ్యులు, కార్యక్రమ అధికారులు, సంబంధిత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

సీనియర్ సిటిజన్లు సమాజానికి దిక్సూచి..





- వృద్ధులను గౌరవించడం మన సంస్కృతి.. వారి అనుభవాలు సమాజానికి మార్గదర్శకం
- రాజయోగ ధ్యానంతో మానసిక ప్రశాంతత
- జీవితంలో రెండో ఇన్నింగ్స్‌ను ఆనందంగా గడపాలి
- 'సంగం' సదస్సులో బ్రహ్మకుమారి కల్పన

హుజురాబాద్, నవంబర్ 11(తెలంగాణ ముచ్చట్లు): వృద్ధాప్యం అనేది జీవితానికి ముగింపు కాదని, జీవితంలో ఎన్నో అనుభవాలను సంపాదించి, ఆ అనుభవాల సారాన్ని సమాజానికి అందించే అద్భుతమైన దశ అని బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధి బ్రహ్మకుమారి కల్పన పేర్కొన్నారు. వయసు పెరిగినంత మాత్రాన మనిషిలో ఉత్సాహం, ఆత్మవిశ్వాసం తగ్గాల్సిన అవసరం లేదని, సీనియర్ సిటిజన్లు తమ అనుభవం, విజ్ఞానం, నైపుణ్యాలతో సమాజానికి దిక్సూచిగా నిలవాలని పిలుపునిచ్చారు. వృద్ధులను నడిచే దేవతలుగా భావించి గౌరవించడం మన భారతీయ సంస్కృతిలో భాగమని గుర్తుచేశారు.

వయోవృద్ధుల్లో ఆత్మగౌరవాన్ని పెంపొందించి, వారిలో నూతనోత్సాహాన్ని నింపడంతో పాటు జీవితంలోని మలి దశను ఆనందంగా గడిపేలా ప్రోత్సహించాలనే లక్ష్యంతో బ్రహ్మకుమారీస్ సామాజిక సేవా విభాగం, భారత ప్రభుత్వ సామాజిక న్యాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సంగం' కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రజాపిత బ్రహ్మకుమారీస్ హుజురాబాద్ కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్రహ్మకుమారి కల్పన ముఖ్య వక్తగా హాజరై సీనియర్ సిటిజన్లకు పలు విలువైన సూచనలు చేశారు.

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక.. భగినీ హస్త భోజనం!




- రక్తసంబంధాల గొప్పతనాన్ని చాటిచెప్పే భాతృ ద్వితీయ..
- అన్నదమ్ముల ఆయురారోగ్యాలను ఆకాంక్షిస్తూ అక్కాచెల్లెళ్ల ఆప్యాయత..

హనుమకొండ, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు): భారతీయ సంప్రదాయంలో అన్నాచెల్లెళ్ల అనుబంధం, అక్కాతమ్ముళ్ల మధ్య ఉండే రక్తసంబంధానికి, అనుబంధానికి ప్రత్యేక స్థానం ఉంది. అన్నదమ్ములకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షిస్తూ అక్కాచెల్లెళ్లు ప్రేమతో వంటలు చేసి వడ్డించే హస్త భోజన వేడుక కుటుంబ సభ్యుల మధ్య ఆనందోత్సాహాలను నింపింది.

ఈ సందర్భంగా ఘన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన కొలిపాక సతీష్ చెల్లెలు సింగారపు శైలజ తన అన్నదమ్ములైన కొలిపాక సతీష్, శ్రీకాంత్‌లను హనుమకొండలోని తన నివాసానికి ఆహ్వానించారు. సంప్రదాయబద్ధంగా దీపంతో హారతి ఇచ్చి సాదరంగా స్వాగతం పలికారు.అనంతరం తన చేతులతో స్వయంగా తయారుచేసిన తొమ్మిది రకాల వంటకాలను అరటి ఆకులో వడ్డించారు. పప్పు, చారు, పెరుగు, తీపి పదార్థాలతో పాటు పలు రకాల రుచికరమైన వంటకాలను ప్రేమతో వడ్డించి అన్నదమ్ములకు స్వయంగా తినిపించారు. అక్కాచెల్లెళ్ల చేతి వంటలోని రుచితో పాటు వారి ఆప్యాయత, ప్రేమానురాగాలు ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అన్నదమ్ములకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షిస్తూ సింగారపు శైలజ నిర్వహించిన ఈ వేడుక కుటుంబ బంధాల గొప్పతనాన్ని చాటిచెప్పింది.రక్తసంబంధాల మధ్య ప్రేమానుబంధాలను మరింత బలోపేతం చేసే ఇలాంటి సంప్రదాయాలు భారతీయ కుటుంబ వ్యవస్థలో ప్రత్యేకమైన స్థానాన్ని కలిగి ఉన్నాయని ఈ వేడుక మరోసారి చాటిచెప్పింది.

ఈ కార్యక్రమంలో కొలిపాక సతీష్, శ్రీకాంత్, కిట్టు, సింగారపు శ్రీనివాస్, సిద్ధార్థ్, దేవాన్ష్, సిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు జరిగేలా భూముల రీసర్వే చేపట్టాలి





- పారదర్శకత, కచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి
- నవంబర్ నెలాఖరులోగా తొలి విడత రీసర్వే పూర్తి చేయాలి
- అవకతవకలకు పాల్పడితే సస్పెన్షన్‌తో పాటు క్రిమినల్ కేసులు
- అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హనుమకొండ, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్రంలో భూముల పునఃసర్వే ప్రక్రియను ప్రజలకు మేలు జరిగేలా, పూర్తి పారదర్శకతతో, పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పునఃసర్వేలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, తొందరపాటుతో తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నవంబర్ నెలాఖరులోగా ప్రతి జిల్లాలో తొలి విడతలో ఎంపిక చేసిన 70 గ్రామాలతో పాటు నక్షా లేని గ్రామాల్లోనూ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు.బుధవారం హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో భూముల పునఃసర్వే ప్రక్రియపై దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సమావేశానికి హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. భూముల పునఃసర్వేపై ఇప్పటికే పలుమార్లు సమావేశాలు నిర్వహించామని, ఉమ్మడి జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ జిల్లా, మండల స్థాయిలో రెవెన్యూ అంశాలపై సమీక్షలు చేపట్టామని తెలిపారు. పునఃసర్వే ఫలితాలు క్షేత్రస్థాయిలో ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు క్షేత్రస్థాయి నివేదికలను సేకరిస్తున్నామని పేర్కొన్నారు. సర్వే సందర్భంగా ఎదురవుతున్న సమస్యలు, లోపాలు, వాటి పరిష్కార మార్గాలపై సమగ్రంగా చర్చిస్తున్నట్లు వెల్లడించారు.

ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని పక్కాగా అమలు చేయాలి

భూముల పునఃసర్వేకు సంబంధించి రూపొందించిన ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని అధికారులు కచ్చితంగా అమలు చేయాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయి నివేదికల ఆధారంగా అవసరమైన మార్పులు, సవరణలు చేపట్టాలని తెలిపారు. ఉన్నతాధికారులను సంతృప్తిపరిచే నివేదికల కంటే క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించే నివేదికలకే ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.రాబోయే ఏడాదిన్నర కాలంలో రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో భూముల పునఃసర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, అందుకు అనుగుణంగా జిల్లా కలెక్టర్లు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ సర్వే పనులను వేగవంతం చేయాలని సూచించారు.

మండలాల వారీగా ప్రత్యేక బృందాల ఏర్పాటు

ప్రతి మండలంలో పునఃసర్వే కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. అందుబాటులో ఉన్న లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, అవసరాన్ని బట్టి సర్వే బృందాల సంఖ్యను పెంచాలని సూచించారు. అధికారులు పూర్తి బాధ్యతతో, చిత్తశుద్ధితో పనిచేసి నిర్ణీత గడువులోగా లక్ష్యాలను సాధించాలని తెలిపారు.

రైతులకు ముందస్తు సమాచారం.. అభ్యంతరాల పరిష్కారానికి అవకాశం

పునఃసర్వే చేపట్టే గ్రామాల్లో సంబంధిత రైతులకు ముందుగానే సమాచారం అందించాలని మంత్రి సూచించారు. రైతుల సమక్షంలోనే సర్వే ప్రక్రియ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, ముందస్తు నోటీసులు జారీ చేయడంతో పాటు అవసరమైన అవగాహన కల్పించాలని తెలిపారు. సర్వే నివేదికలపై అభ్యంతరాలు ఎలా సమర్పించాలి, ఎక్కడ సమర్పించాలి, వాటిని ఏ విధంగా పరిష్కరిస్తారనే అంశాలపై ప్రజలకు ముందుగానే వివరించాలని ఆదేశించారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో వివరాలను ప్రజలకు తెలియజేస్తూ దండోరా వేయించాలని, ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించి వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు.పునఃసర్వే పూర్తయిన ప్రాంతాల్లో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను క్యూఆర్ సంకేతంతో అందించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో భూముల సర్వే వివరాలు, రికార్డులు కచ్చితంగా ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు.

అసైన్డ్ భూముల పట్టాలపై క్షుణ్ణంగా పరిశీలన

అసైన్డ్ భూములకు సంబంధించి పట్టాలు అసలైనవా, నకిలీవా అనే అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. పట్టా పొందిన వ్యక్తులే ప్రస్తుతం ఆ భూములను అనుభవిస్తున్నారా లేదా అనే విషయాన్ని నిర్ధారించాలని తెలిపారు. గతంలో ఒకరికి పట్టా ఇచ్చినప్పటికీ ప్రస్తుతం మరొకరు భూమిని అనుభవిస్తున్నట్లయితే, ప్రస్తుత అనుభవదారుడు నిబంధనల ప్రకారం అర్హుడా కాదా అనే అంశాన్ని పరిశీలించాలని సూచించారు.పట్టాలో పేర్కొన్న భూమి విస్తీర్ణానికి, క్షేత్రస్థాయిలో ఉన్న విస్తీర్ణానికి మధ్య తేడాలు ఉన్నాయా అనే విషయాన్ని కూడా క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. సాగునీటి చెరువులు, రహదారులు, కుంటలు, ఇతర అభివృద్ధి పనుల కోసం గతంలో భూసేకరణ చేసిన భూములకు సంబంధించిన సర్వే నంబర్లలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. పునఃసర్వే ప్రక్రియలో ఎలాంటి సమస్యలు పెండింగ్‌లో ఉండకుండా అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

భూముల పునఃసర్వేలో ఏ అధికారి అయినా అక్రమాలకు, అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. సంబంధిత అధికారులను సస్పెండ్ చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ప్రజలకు ఎలాంటి భూ వివాదాలు తలెత్తకుండా సర్వే ప్రక్రియను నాణ్యతతో, పారదర్శకంగా పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.. నిర్ణయించిన గడువుకు అనుగుణంగా పునఃసర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ రవి, ఆర్డీఓలు, భూముల సర్వే సహాయ సంచాలకులు, కలెక్టరేట్ పరిపాలనాధికారి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ మైదానంలో సీఐ విశ్వేశ్వర్ సిక్సర్ల మోత!

- 47 బంతుల్లో 90 పరుగులతో అజేయంగా నిలిచిన వరంగల్ పోలీస్ జట్టు కెప్టెన్
- 10 భారీ సిక్సర్లు, 5 ఫోర్లతో ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించిన సీఐ



గీసుగొండ, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు): క్రికెట్ మైదానంలో వరంగల్ పోలీస్ జట్టు కెప్టెన్, సీఐ విశ్వేశ్వర్ తన బ్యాటింగ్ ప్రతిభతో అదరగొట్టారు. బంతిని బౌండరీ దాటిస్తూ సిక్సర్ల వర్షం కురిపించి తన సత్తా చాటారు.త్వరలో నిర్వహించనున్న ఐదో తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడా పోటీలకు సన్నాహకంగా ఏడు పోలీస్ బెటాలియన్ల క్రీడాకారులతో కూడిన రేంజ్ 1 పోలీస్ జట్టుతో వరంగల్ పోలీస్ జట్టు సాధన మ్యాచ్ ఆడింది. ఈ మ్యాచ్‌లో వరంగల్ పోలీస్ జట్టు కెప్టెన్ విశ్వేశ్వర్ విధ్వంసకర బ్యాటింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షించారు.

కేవలం 47 బంతులను ఎదుర్కొన్న ఆయన 10 భారీ సిక్సర్లు, 5 ఫోర్లతో అజేయంగా 90పరుగులు సాధించారు. మైదానం నలుమూలలా బంతులను తరలిస్తూ ప్రత్యర్థి బౌలర్లకు ముచ్చెమటలు పట్టించారు. ఆయన ధాటికి మైదానంలో సిక్సర్ల మోత మోగింది. ఈ అద్భుత ప్రదర్శనతో మ్యాచ్‌లో ఉత్తమ బ్యాటర్‌గా నిలిచిన విశ్వేశ్వర్ 8.95 అత్యుత్తమ ఆటగాడి రేటింగ్‌ను సైతం సాధించారు. ఆయన మెరుపు ఇన్నింగ్స్ వరంగల్ పోలీస్ జట్టులో నూతనోత్సాహాన్ని నింపడమే కాకుండా, రాబోయే రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడా పోటీల్లో సత్తా చాటేందుకు జట్టు సభ్యుల్లో మరింత ఆత్మవిశ్వాసాన్ని నింపింది. విధి నిర్వహణలోనే కాదు.. క్రీడా మైదానంలోనూ సీఐ విశ్వేశ్వర్ తనదైన ముద్ర వేస్తూ అందరి ప్రశంసలు అందుకున్నారు.

రక్తసంబంధం,ఆత్మీయ అనుబంధాలకు ప్రతీకగా భోగి హస్త భోజన వేడుక



- అన్నదమ్ములకు ఆప్యాయంగా భోజనం వడ్డించిన అక్కాచెల్లెళ్లు..
- అన్నదమ్ములకు అక్కాచెల్లెళ్ల ఆప్యాయతతో హస్త భోజనం..
- తొమ్మిది రకాల వంటకాలతో సంప్రదాయబద్ధంగా వేడుక

హనుమకొండ, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు): భారతీయ సంప్రదాయంలో అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉండే రక్తసంబంధానికి, అనుబంధానికి ప్రత్యేక స్థానం ఉంది. అన్నదమ్ములకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షిస్తూ అక్కాచెల్లెళ్లు ప్రేమతో వంటలు చేసి వడ్డించే హస్త భోజన వేడుక కుటుంబ సభ్యుల మధ్య ఆనందోత్సాహాలను నింపింది.

ఈ సందర్భంగా ఘన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన కొలిపాక సతీష్ చెల్లెలు సింగారపు శైలజ తన అన్నదమ్ములైన కొలిపాక సతీష్, శ్రీకాంత్‌లను హనుమకొండలోని తన నివాసానికి ఆహ్వానించారు. సంప్రదాయబద్ధంగా దీపంతో హారతి ఇచ్చి సాదరంగా స్వాగతం పలికారు.అనంతరం తన చేతులతో స్వయంగా తయారుచేసిన తొమ్మిది రకాల వంటకాలను అరటి ఆకులో వడ్డించారు. పప్పు, చారు, పెరుగు, తీపి పదార్థాలతో పాటు పలు రకాల రుచికరమైన వంటకాలను ప్రేమతో వడ్డించి అన్నదమ్ములకు స్వయంగా తినిపించారు. అక్కాచెల్లెళ్ల చేతి వంటలోని రుచితో పాటు వారి ఆప్యాయత, ప్రేమానురాగాలు ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అన్నదమ్ములకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షిస్తూ సింగారపు శైలజ నిర్వహించిన ఈ వేడుక కుటుంబ బంధాల గొప్పతనాన్ని చాటిచెప్పింది.రక్తసంబంధాల మధ్య ప్రేమానుబంధాలను మరింత బలోపేతం చేసే ఇలాంటి సంప్రదాయాలు భారతీయ కుటుంబ వ్యవస్థలో ప్రత్యేకమైన స్థానాన్ని కలిగి ఉన్నాయని ఈ వేడుక మరోసారి చాటిచెప్పింది.

ఈ కార్యక్రమంలో కొలిపాక సతీష్, శ్రీకాంత్, కిట్టు, సింగారపు శ్రీనివాస్, సిద్ధార్థ్, దేవాన్ష్, సిరి తదితరులు పాల్గొన్నారు.

మురసు తుఫాన్ నష్టంపై సీఎంకు ఎమ్మెల్యే జారె వినతి

- దెబ్బతిన్న రహదారులు, మౌలిక వసతుల పునరుద్ధరణకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి.



అశ్వారావుపేట, నవంబరు 11(తెలంగాణ ముచ్చట్లు): మురసు తుఫాన్ కారణంగా అశ్వారావుపేట నియోజకవర్గంలో జరిగిన భారీ నష్టాన్ని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఆయనను కలిసి నియోజకవర్గంలోని పరిస్థితులను వివరించారు. అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి మండలాల్లో భారీ వర్షాలు, వరదల కారణంగా రహదారులు, వంతెనలు, చెరువులు, కాలువలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ముఖ్యమంత్రికి వివరించారు. దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించేందుకు అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. తుఫాన్ ప్రభావంతో పంటలు, ఆస్తులు నష్టపోయిన రైతులు, ప్రజలను ఆదుకోవాలని, నష్ట నివారణతో పాటు పునరుద్ధరణ పనుల కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూనే, తుఫాన్ కారణంగా జరిగిన నష్టాన్ని భర్తీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
గురువారం - 12 - నవంబర్ 2026
వరంగల్ 07

భారతీయ కళల వారసత్వాన్ని కొనసాగిద్దాం





- **పిల్లల సృజనాత్మకతను వెలికి తీసేలా ప్రోత్సహించాలి.**
- **సెల్ ఫోన్ బానిసత్వానికి దూరంగా ఉండాలి.**
- **జిల్లా అడిషనల్ సిపి రామానుజం.**
- **హోరెత్తిన రాష్ట్రస్థాయి బాలోత్సవ్ సంబురాలు.**
- **పలు జిల్లాల నుంచి హాజరైన బాల కళాకారులు.**

ఖమ్మం బ్యూరో, నవంబర్ 11(తెలంగాణ ముచ్చట్లు): మనదేశ కళల వారసత్వాన్ని ప్రతి తరం వారు కొనసాగించాలని రాష్ట్ర స్థాయి బాలోత్సవ్ సంబురాల ప్రారంభ సభలో జిల్లా అడిషనల్ పోలీస్ కమిషనర్ రామానుజం తెలియజేశారు. స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో బుధవారం వారధి ఫౌండేషన్, ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఖమ్మం బాలోత్సవ్ వేడుకల ప్రారంభోత్సవానికి అడిషనల్ సిపి రామానుజం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మన దేశానికి చెందిన కళారూపాలు ప్రపంచవ్యాప్తంగా అందరినీ ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు. మన సాంప్రదాయ జానపద కళారూపాలకు రోజురోజుకూ సినిమాల్లోనూ అత్యధిక ప్రాధాన్యత పెరుగుతోందని తెలిపారు. పిల్లల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసేలా తల్లిదండ్రులు నిత్యం ప్రోత్సహించాలని కోరారు. పిల్లలు సెల్ఫోన్ బానిసత్వానికి గురికాకుండా సెల్ ఫోన్ కు దూరంగా ఉండాలని సృజనాత్మకతను పెంపొందించే కళలను నేర్చుకోవడం ద్వారా మానసికంగా, శారీరకంగా , దృఢంగా రూపొందుతారని, సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాయల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఖమ్మం బాలోత్సవ్ సంబురాల సభలో వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ బాలోత్సవంలో పాల్గొనడమే పిల్లలకు గొప్ప విజయం అని, తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ సంబురాలలో పాల్గొనేలా ప్రోత్సహించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కూరపాటి ప్రదీప్, డాక్టర్ జంగాల సునీల్ కుమార్, గ్రంథాలయ చైర్మన్ ఖాదర్ బాబా, డాక్టర్ కాటమనేని రాజకుమార్, నృత్యదర్శకులు ఆర్ ఎన్ ప్రసాద్, న్యాయ నిర్ణేతలు లింగం శ్రీనివాసరావు, జైపాల్, ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ బాధ్యులు చిక్కుళ్ల వెంకటేష్, పగిల్లపల్లి రాజు, ఆర్ ఎన్ ప్రసాద్ ,రాజేష్ ,భవాని శంకర్, ముకేశ్, నాని,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హోరెత్తిన రాష్ట్రస్థాయి బాలోత్సవ్ నృత్యాలు.

వారధి ఫౌండేషన్ ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఖమ్మం బాలోత్సవ్ లో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు హోరెత్తాయి. బుధవారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్, నల్గొండ, పలు జిల్లాల నుంచి బాలలు 300 మందికి పైగా పోటీలలో పాల్గొన్నారు. తొలి రోజు సాంప్రదాయ విభాగాలలో జూనియర్, సీనియర్ విభాగాలలో బాల బాలికలు తమ సృజనాత్మకతకు దర్పణం పట్టారు. నెమళ్ళు నాట్యం ఆడినట్లుగా సాంప్రదాయ వస్త్రధారణలో సంగీతానికి అనుగుణంగా స్టెప్పు లేస్తూ బాలల ప్రదర్శించిన నృత్యాలు సభికులను ఉర్రూతలుగించాయి. అతిపెద్ద డిజిటల్ స్క్రీన్ పై , డిజిటల్ లైట్ల వెలుగులతో బాల బాలికలు ప్రదర్శించిన నృత్యాలను తల్లిదండ్రులు తిలకించి మురిసిపోయారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలన్ని సభికులని కనువిందు చేశాయి.సోలో క్లాసికల్ , ఫోక్ డాన్స్ విభాగాలకు 200 ఎంట్రీస్, గ్రూప్ క్లాసికల్, ఫోక్ డాన్స్ కు గాను 40ఎంట్రీస్, ఫ్యాన్సీ డ్రెస్ విభాగానికి 50ఎంట్రీల ద్వారా బాల బాలికలు తమ సృజనతో కనువిందు చేస్తున్నారు. ఖమ్మం బాలోత్సవ్ పోటీలు గురువారం సాయంత్రం వరకు జరుగుతాయని, అనంతరం విజేతలకు బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమంలో అతిధులు బహుమతి ప్రధానం చేస్తారని వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య, ఖమ్మం డాన్సర్స్ అసోసియేషన్ నిర్వాకులు తెలియజేశారు. ఖమ్మంలో తొలిసారిగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఖమ్మం బాలోత్సవ్ కు బాల బాలికల నుంచి అనూహ్య స్పందన రావడంతో నిర్వాహకుల్లో ఆనందోత్సవాలు వెల్లువిరుస్తున్నాయి.

సిక్కు మైనార్టీలకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిన తెలంగాణ రక్షణ సేన



- **రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్. జస్టీర్ సింగ్ సంధు నియామకం**
- **ప్రధాన కార్యదర్శిగా ఎస్. హర్ ప్రీత్ సింగ్‌కు బాధ్యతలు**
- **బంజారాహిల్స్ పార్టీ కార్యాలయంలో నియామక పత్రాల అందజేత**
- **మైనార్టీల సమస్యల పరిష్కారమే లక్ష్యమన్న కల్వకుంట్ల కవిత**

హైదరాబాద్, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రాజకీయ చరిత్రలో తొలిసారిగా సిక్కు మైనార్టీల కోసం ప్రత్యేక రాష్ట్ర కమిటీని తెలంగాణ రక్షణ సేన ఏర్పాటు చేసింది. సిక్కు మైనార్టీ విభాగానికి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్. జస్టీర్ సింగ్ సంధు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్. హర్ ప్రీత్ సింగ్‌ను పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత నియమించారు. మైనార్టీ వర్గాలకు రాజకీయంగా ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు పార్టీ వెల్లడించింది.

బుధవారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నూతనంగా నియమితులైన అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శికి కవిత నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారికి బాధ్యతలు అప్పగిస్తూ పార్టీ తరపున శుభాకాంక్షలు తెలిపారు. సిక్కు మైనార్టీ వర్గానికి చెందిన నాయకులకు ప్రత్యేక విభాగం ద్వారా పార్టీలో బాధ్యతలు కల్పించడం ఈ నియామకాల ప్రత్యేకతగా పేర్కొన్నారు. సాధారణంగా రాజకీయ పార్టీల మైనార్టీ విభాగాల్లో ముస్లింలు, క్రైస్తవులతో పాటు సిక్కులు, ఇతర మైనార్టీ వర్గాలకు కూడా వివిధ పదవుల్లో అవకాశాలు కల్పిస్తుంటారు. అయితే తెలంగాణ రక్షణ సేన ఇప్పటికే ముస్లిం, క్రైస్తవ మైనార్టీలకు వేర్వేరు కమిటీలను ప్రకటించింది. తాజాగా సిక్కు మైనార్టీల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడంతో ఆయా వర్గాలకు ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించే దిశగా మరో అడుగు వేసినట్లయింది.

మైనార్టీ వర్గాలన్నింటికీ ఒకే విధమైన సమస్యలు ఉండవని కవిత పేర్కొన్నారు. ఒక్కో వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాలు భిన్నంగా ఉంటాయని వివరించారు. ఆయా వర్గాల సమస్యలను ప్రత్యేకంగా గుర్తించి, వాటికి తగిన ప్రాధాన్యం ఇచ్చేందుకు వేర్వేరు కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి వర్గానికి న్యాయం జరగాలన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. సిక్కు మైనార్టీ విభాగం నూతన కమిటీ ద్వారా ఆ వర్గానికి సంబంధించిన సమస్యలు, అవసరాలను పార్టీ దృష్టికి తీసుకురావడానికి అవకాశం ఏర్పడనుంది. రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి తమకు అప్పగించిన బాధ్యతలతో విభాగాన్ని ముందుకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. మైనార్టీ వర్గాలకు ప్రత్యేక గుర్తింపు, ప్రాతినిధ్యం కల్పించాలనే పార్టీ విధానంలో భాగంగానే ఈ నియామకాలు చేపట్టినట్లు తెలంగాణ రక్షణ సేన తెలిపింది.

తెలంగాణలో తొలి స్వచ్ఛ నగరంగా హైదరాబాద్


- **స్వచ్ఛ సర్వేక్షణ్ 2025–26లో జీహెచ్ఎంసీకి జాతీయ గుర్తింపు**
- **రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారం స్వీకరణ**
- **అధికారులకు అభినందనలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**
- **గ్రీన్ సిటీ, నెట్‌జీరో సిటీగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యం**



హైదరాబాద్, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు): స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తెలంగాణ రాష్ట్రంలో తొలి స్వచ్ఛ నగరంగా గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జీహెచ్ఎంసీ అధికారులకు అభినందనలు తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్‌లో హైదరాబాద్‌కు ఈ గుర్తింపు లభించింది. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ, ఘన వ్యర్థాల శుద్ధి, మురుగునీటి నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలను ప్రాతిపదికగా తీసుకుని ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. పట్టణ పరిశుభ్రతకు సంబంధించిన వివిధ ప్రమాణాల్లో జీహెచ్ఎంసీ పనితీరును అంచనా వేసిన అనంతరం హైదరాబాద్‌కు ఈ గుర్తింపు లభించింది. నగర పారిశుద్ధ్య నిర్వహణలో చేపడుతున్న కార్యక్రమాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కింది. న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పురస్కారం స్వీకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులను ముఖ్యమంత్రి అభినందించారు. నగరానికి ఈ గుర్తింపు రావడం హైదరాబాద్‌తో పాటు తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు.

హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా, నెట్‌జీరో సిటీగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. పారిశుద్ధ్య ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు పట్టణ పరిశుభ్రతను పెంపొందించడం, పచ్చదనాన్ని విస్తరించడంపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. పర్యావరణహితమైన, సుస్థిర నగరంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఈ గుర్తింపు మరింత ప్రోత్సాహాన్నిస్తుందని అన్నారు. ఈ పురస్కారం సాధించడంలో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికుల కృషి కీలకమని ముఖ్యమంత్రి ప్రశంసించారు. నిరంతరం అంకితభావంతో పనిచేస్తున్న వారి సమష్టి కృషికి లభించిన గుర్తింపుగా ఈ అవార్డును అభివర్ణించారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో పారిశుద్ధ్య నిర్వహణను కొనసాగిస్తూ నగరాన్ని మరింత పరిశుభ్రంగా, పచ్చదనంతో కూడిన పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు.

ఆదిలాబాద్‌లో రూ.58.85 కోట్లతో నిర్మించిన ఐటీ టవర్ ప్రారంభం



- **ప్రారంభించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**
- **టాస్క్ శిక్షణ కేంద్రం, ఇంక్యుబేషన్ హబ్ ఏర్పాటు**
- **పలు సంస్థల ద్వారా 620 మందికి ఉపాధి అవకాశాలు**
- **యువతకు ఐటీ రంగంలో నైపుణ్య శిక్షణకు ప్రాధాన్యం**

ఆదిలాబాద్, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు): ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రూ.58.85 కోట్లతో నిర్మించిన నూతన ఐటీ టవర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బుధవారం ప్రారంభించారు. ఎంపీ జి. నగేష్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి ఆయన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో ఐటీ రంగానికి అవసరమైన మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావడంలో ఈ భవనం కీలకంగా నిలవనుంది. ఐటీ టవర్‌లో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) శిక్షణ కేంద్రంతో పాటు ఇంక్యుబేషన్ హబ్‌ను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. యువతకు ఐటీ రంగానికి అవసరమైన నైపుణ్యాలు అందించడంతో పాటు నూతన ఆలోచనలతో ముందుకొచ్చే ఔత్సాహికులకు ప్రోత్సాహం కల్పించేలా ఈ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. స్థానిక యువతకు శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు.

ఐటీ టవర్‌లో ఇప్పటికే పలు సంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభించాయని మంత్రి వెల్లడించారు. ఎన్‌టీటీ డేటా సంస్థ ద్వారా 300 మందికి, ఎన్ ల్యాబ్స్ ద్వారా 250 మందికి ఉపాధి కల్పించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వైడర్ సాఫ్ట్‌వేర్‌లో 20 మందికి, పోస్టిట్ ఏఐలో 50 మందికి ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సంస్థల ద్వారా మొత్తం 620 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి.

జిల్లాలో ఐటీ రంగం విస్తరణకు ఈ టవర్ దోహదపడుతుందని కార్యక్రమంలో వివరించారు. టాస్క్ కేంద్రం ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ అందించడం, ఇంక్యుబేషన్ హబ్ ద్వారా నూతన వ్యాపార ఆలోచనలకు వేదిక కల్పించడం ఈ ప్రాజెక్టులోని ముఖ్యాంశాలు. ఐటీ సంస్థల రాకతో ఆదిలాబాద్ యువతకు తమ ప్రాంతంలోనే ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశం ఏర్పడనుంది. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ కార్యదర్శులు అనుదీప్, శశాంక్, అదనపు కలెక్టర్లు ఎస్. రాజేశ్వర్, ఆర్.ఎస్. చిత్రు, ఎస్పీ అఖిల్ మహాజన్, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ శివ ప్రసాద్, ఆర్డీవో జగదీశ్వర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, ఐటీ శాఖ అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు కూడా హాజరయ్యారు.

'వంశధార' పుస్తకాన్ని ఆవిష్కరించిన సజ్జనార్





- **నాలుగేళ్ల శ్రమతో వచన కవితల సంపుటి రచన**
- **హైదరాబాద్ నగర పోలీస్ ఐటీ విభాగంలో కానిస్టేబుల్‌గా నారాయణరావు**
- **బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీలో పుస్తకావిష్కరణ**
- **రచయితను అభినందించిన నగర పోలీస్ కమిషనర్**

హైదరాబాద్, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు): పోలీసు విధులు నిర్వహిస్తూనే సాహిత్యంపై తనకున్న ఆసక్తిని కొనసాగించిన హైదరాబాద్ నగర పోలీస్ ఐటీ విభాగం కానిస్టేబుల్ కురిటి నారాయణరావు రచయితగా తన ప్రతిభను చాటుకున్నారు. నాలుగేళ్ల పాటు నిరంతర శ్రమతో వచన కవితల సంపుటి 'వంశధార'ను రూపొందించారు. విధి నిర్వహణతో పాటు రచనా వ్యాసంగాన్ని కొనసాగించి పుస్తకాన్ని తీసుకురావడం ఆయన సాహిత్య ప్రస్థానంలో ముఖ్యమైన ఘట్టంగా నిలిచింది.

బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీజీఐసీసీసీ)లో జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. నారాయణరావు రచించిన వచన కవితల సంపుటిని ఆయన ఆవిష్కరించి రచయితకు అభినందనలు తెలిపారు. పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న వ్యక్తి సాహిత్య రంగంలోనూ తన ఆసక్తిని కొనసాగించడం ఈ కార్యక్రమానికి ప్రత్యేకతను తీసుకొచ్చింది. నారాయణరావు హైదరాబాద్ నగర పోలీస్ ఐటీ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే రచనలకు సమయం కేటాయించారు. నాలుగేళ్లపాటు సాగిన ఈ ప్రయత్నం చివరకు 'వంశధార' పుస్తక రూపంలో పాఠకుల ముందుకు వచ్చింది. ఉద్యోగ బాధ్యతలు, వ్యక్తిగత ఆసక్తులను సమన్వయం చేసుకుంటూ ఈ సంపుటిని సిద్ధం చేశారు. సాధారణంగా పోలీసులంటే శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ వంటి విధులతోనే గుర్తుకు వస్తారు. అయితే వారి వ్యక్తిగత ఆసక్తులు, సృజనాత్మక ప్రతిభ కూడా వివిధ రంగాల్లో వెలుగులోకి వస్తుంటాయి. నారాయణరావు రచనా ప్రయాణం కూడా పోలీసు విధులకు అతీతంగా ఆయనలోని సాహిత్య అభిరుచిని పరిచయం చేస్తోంది. నాలుగేళ్ల కృషితో పుస్తకాన్ని రూపొందించడం ఆయన పట్టుదలకు నిదర్శనంగా నిలుస్తోంది.

'వంశధార' ఆవిష్కరణతో నారాయణరావు రచనా ప్రస్థానంలో మరో ముందడుగు పడింది. ఈ సందర్భంగా హైదరాబాద్ నగర పోలీస్ శాఖ ఆయనను అభినందించింది. పోలీసు ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూనే సాహిత్య రంగంలో గుర్తింపు పొందే దిశగా చేసిన ఈ ప్రయత్నం పలువురికి స్ఫూర్తినిస్తోంది.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

తెలంగాణ బిడ్డలు ప్రపంచాన్ని శాసించేలా
విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

(మొదటి పేజీ తరువాయి)

ముందుగా భారతరత్న, దేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో నిర్మించనున్న తెలంగాణ ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణ నమూనాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ స్ఫూర్తి, మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో విద్యారంగాన్ని సమూలంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. విద్య ద్వారానే సమాజంలో సమానత్వం, ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని, అందుకే ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు.

దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యారంగ అభివృద్ధికి బలమైన పునాదులు వేశారని గుర్తు చేశారు. ఆయన జయంతి సందర్భంగా నివాళులర్పించడంతో పాటు, విద్యారంగంలో ఆయన ఆశయాలను ఆచరణలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కులగణన సర్వేలో విద్యాభివృద్ధి సామాజిక పురోగతికి కీలకమని స్పష్టమైందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ విద్యావ్యవస్థను ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.

ఒక్కో పాఠశాలకు
రూ.200 కోట్ల కేటాయింపు

మహాత్మా గాంధీ ప్రారంభించిన యంగ్ ఇండియా పత్రిక స్ఫూర్తితో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలను నిర్మిస్తున్నామని భట్టి విక్రమార్క వివరించారు. ఒక్కో పాఠశాలను 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఒక్కో పాఠశాలకు సుమారు రూ.200 కోట్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 105 పాఠశాలలను మంజూరు చేశామని వెల్లడించారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలకు చెందిన విద్యార్థులందరూ ఒకే ప్రాంగణంలో కలిసి చదువుకునేలా వీటిని రూపొందిస్తున్నామని తెలిపారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే విద్యా ప్రాంగణంలో విద్యనభ్యసించేలా ఆధునిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి సైతం వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, వచ్చే విద్యా సంవత్సరం నాటికి అనేక పాఠశాలలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

ప్రతి నియోజకవర్గానికి
తెలంగాణ ప్రభుత్వ పాఠశాల

రాష్ట్రంలోని ప్రతి శాసనసభ నియోజకవర్గానికి ఒక తెలంగాణ ప్రభుత్వ పాఠశాలను మంజూరు చేశామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రాథమిక పూర్వ విద్య నుంచి ఇంటర్మీడియట్ వరకు ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్య అందించేలా వీటిని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఆధునిక బోధనా పద్ధతులు, డిజిటల్ విద్య, ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పిస్తామన్నారు.ఈ పాఠశాలలు పాక్షిక వసతి విధానంలో పనిచేస్తాయని వివరించారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు, బూట్లు, టై, పుస్తకాలు, నోటు పుస్తకాలు, సంచులు అందించడంతో పాటు ఇంటి నుంచి పాఠశాలకు, తిరిగి ఇంటికి చేరుకునేందుకు ప్రభుత్వమే రవాణా సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు.ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం పాఠశాలలోనే అందిస్తామని, క్రీడలు, ఇతర విద్యా సంబంధిత కార్యక్రమాల అనంతరం సాయంత్రం విద్యార్థులను ఇళ్లకు చేరుస్తామని చెప్పారు. పిల్లలు తల్లిదండ్రులతో గడిపే సమయాన్ని, కుటుంబ అనుబంధాలను కోల్పోకూడదనే ఉద్దేశంతోనే పాక్షిక వసతి విధానాన్ని రూపొందించామని వివరించారు.

27 లక్షల మంది విద్యార్థులకు
ఏకకాలంలో అల్పాహారం

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 27 లక్షల మంది విద్యార్థులకు ఈ ఏడాది నుంచి ఉదయం అల్పాహార పథకాన్ని ప్రారంభించామని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, పురపాలక, గురుకుల పాఠశాలల విద్యార్థులకు ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు.

పరిశుభ్రమైన వాతావరణంలో కేంద్రీకృత వంటశాలల ద్వారా అల్పాహారం తయారు చేసి ఉదయం 8.30 నుంచి 9.30 గంటల మధ్య అన్ని పాఠశాలలకు సరఫరా చేస్తున్నామని తెలిపారు.కేవలం గంట వ్యవధిలో 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం అందించడం దేశంలోనే కాకుండా ప్రపంచంలోనూ ప్రత్యేకమైన కార్యక్రమమని పేర్కొన్నారు.

వైద్య నిపుణుల సూచనల మేరకు పోషక విలువలతో కూడిన అల్పాహారాన్ని అందిస్తున్నామని, వారంలో ఆరు రోజులు అల్పాహారంతో పాటు నిర్ణీత రోజుల్లో పాలు, రాగిజావ కూడా అందిస్తున్నామని వివరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సదుపాయాలు, నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తున్నప్పటికీ, ఆ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవడంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ విద్యా కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మీడియా ప్రతినిధులను కోరారు.

కాజీపేట అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ హనుమకొండ నగరంతో పాటు కాజీపేట ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఇందులో భాగంగానే కాజీపేటలో తెలంగాణ ప్రభుత్వ పాఠశాల నిర్మాణం చేపడుతున్నామని పేర్కొన్నారు.

ఘన స్వాగతం..
పలువురు అధికారుల హాజరు

కార్యక్రమానికి విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఇతర ఉన్నతాధికారులు పుష్పగుచ్ఛాలు, మొక్కలు అందించి ఘనంగా స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్ గౌడ్, హనుమకొండ ఆర్డీఓ వెంకటేష్, స్థానిక తహసీల్దార్ రాజు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌కు స్వస్తి.. పాఠశాలల్లోనే 12వ తరగతి!

(మొదటి పేజీ తరువాయి)

ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుందని తెలిపారు.యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలల నిర్మాణ పురోగతిపై సమీక్షించిన ముఖ్య మంత్రి, నిర్మాణ పనుల్లో వేగం పెంచి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.నగర పరిధిలో నిర్మిస్తున్న పాఠశాలల పనుల పురోగతిని కూడా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా ఎక్కడైనా నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటే వెంటనే ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

వృత్తి విద్యకు ప్రోత్సాహం..
విశ్వవిద్యాలయాల్లో నియామకాలు

పారిశ్రామిక శిక్షణ సంస్థలను అధునాతన శిక్షణ కేంద్రాలుగా మార్చిన తర్వాత విద్యార్థుల ప్రవేశాలు పెరగడంతో పాటు, శిక్షణ పొందిన వారికి ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలల ఆధునికీకరణకు అవసరమైన నిధుల విడుదలను వేగవంతం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో సహాయ, సహచర, ఇతర ఆచార్యుల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. నియామకాల్లో నిబంధనలను కచ్చితంగా పాటించాలని, ఈ విషయంలో ఉన్నత విద్యామండలి చైర్మన్, విశ్వవిద్యాలయాల ఉపకులపతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, పి. సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ మొలుగరం కుమార్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీలో కొనసాగుతున్న కలుషిత నీటి కలకలం

- **విద్యార్థులకు చర్మ సమస్యలు!**
- **నాలుగు రోజులుగా మట్టి, మడ్డితో కూడిన నీరు వస్తోందని ఆరోపణ**



బాసర, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు): నిర్మల్ జిల్లాలోని బాసర రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో నీటి సమస్య మరోసారి తెరపైకి వచ్చింది. గత కొంతకాలంగా క్యాంపస్‌లో నీటి సరఫరాపై ఇబ్బందులు ఎదురవుతున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. సెలవుల అనంతరం క్యాంపస్‌కు తిరిగి వచ్చిన విద్యార్థులకు మళ్లీ అదే సమస్య ఎదురుకావడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు రోజులుగా కుళాయిల నుంచి మట్టి, మడ్డితో కూడిన నీరు వస్తోందని ఆరోపిస్తున్నారు. ఈ నీటిని వినియోగించడం వల్ల చేతులు, మెడతో పాటు శరీరంలోని ఇతర భాగాల్లో దురద, అలర్జీలు, దద్దుర్లు వస్తున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజువారీ అవసరాలకు సైతం ఈ నీటిపైనే ఆధారపడాల్సి వస్తోందని చెబుతున్నారు. నీటి నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యంపై ఆందోళన పెరుగుతోంది. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి నీటి పరీక్షల నివేదికలు అందుబాటులోకి రాలేదు. నీటి సమస్య ప్రభావం క్యాంపస్‌లోని విద్యా కార్యకలాపాలపైనా పడుతోందని విద్యార్థులు పేర్కొంటున్నారు.

త్వరలోనే మూసీ రివర్ ఫ్రంట్ పనులు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న సమయంలోనే దేశంలో ఐఐటీల స్థాపనకు శ్రీకారం చుట్టారని తెలిపారు. దేశ విద్యా విధానానికి రూపకల్పన చేయడంతో పాటు ప్రముఖ విద్యాసంస్థల ఏర్పాటుకు పునాదులు వేసి, భారతదేశ కీర్తి ప్రతిష్ఠలను పెంపొందించారని కొనియాడారు.ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం విద్య ఉంటే సరిపోదని, ప్రపంచవ్యాప్తంగా నైపుణ్యాలు కలిగిన వారికే అధిక ప్రాధాన్యత లభిస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా యువత నూతన నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ లక్ష్యంతోనే రాష్ట్రంలోని పారిశ్రామిక శిక్షణ సంస్థలను అధునాతన శిక్షణ కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.నర్సరీ నుంచి 12వ తరగతి వరకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, ఆ తర్వాత నైపుణ్యాభివృద్ధికి, తదనంతరం ఆవిష్కరణలకు ప్రాధాన్యతనిచ్చేలా విద్యారంగంలో సంస్కరణలు చేపడుతున్నామని వివరించారు. మైనారిటీ యువతలో ఎంతోమంది ప్రతిభ, నైపుణ్యాలు కలిగిన వారు ఉన్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలని, చదువుపై ఆసక్తి లేని వారికి నైపుణ్య శిక్షణ అందించాలని లేదా క్రీడల్లో ప్రోత్సహించాలని సూచించారు.ప్రస్తుతం నైపుణ్య ఆధారిత ఉద్యోగాలకు, ముఖ్యంగా శారీరక శ్రమతో కూడిన వృత్తి ఉద్యోగాలకు ప్రాధాన్యత పెరుగుతోందని చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్రంలో నైపుణ్య విశ్వవిద్యాలయం, యంగ్ ఇండియా క్రీడా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

మైనారిటీలు అభివృద్ధి సాధిస్తేనే దేశం ముందడుగు

దేశ జనాభాలో సుమారు 15 శాతం ఉన్న మైనారిటీ వర్గాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినప్పుడే దేశం సమగ్రంగా ముందుకు సాగుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. మైనారిటీల్లో పేదరికాన్ని తొలగించి, వారికి మెరుగైన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో సచార్ కమిటీ సిఫారసులకు అనుగుణంగా నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించినట్లు తెలిపారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చే లక్ష్యంతో హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మించబోతున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు అభివృద్ధి, విద్య, వైద్యం వంటి కీలక రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

మెట్రో విస్తరణ పనులకు త్వరలో శ్రీకారం

హైదరాబాద్ నగర రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు గౌలిగూడ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మెట్రో రైలు విస్తరణ పనులను రానున్న రెండు నెలల్లో ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. మీరాలం చెరువును మరో ఏడాది కాలంలో అత్యంత సుందరమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. నగర అభివృద్ధితో పాటు పర్యాటక రంగానికి ప్రోత్సాహం కల్పించేలా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రులు మహమ్మద్ అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్, వి.హనుమంతరావు, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, తెలంగాణ మైనారిటీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ ఉపాధ్యక్షుడు, అధ్యక్షుడు ఫహీం ఖురేషీతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

దుబ్బాకలో కరువు కనిపించడం లేదా?

- **ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి**

దుబ్బాక, నవంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు): దుబ్బాక నియోజకవర్గంలో కరువు పరిస్థితులు తీవ్రరూపం దాల్చుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి, నాయకులకు కనిపించడం లేదా అని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు.ఎండిపోతున్న పంట పొలాలు, అడుగంటుతున్న భూగర్భ జలాలు, రబీ సాగుపై నెలకొన్న అనిశ్చితితో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం రాజకీయ విమర్శలకే పరిమితమైందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని కోరారు. బుధవారం తొగుట మండలంలోని వెంకట్రావుపేట, జప్తిలింగారెడ్డిపల్లి, చందాపూర్, పెద్దమాసాన్‌పల్లి, బండారుపల్లి, ఘనపూర్, గుడికందుల, గోవర్ధనగిరి గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి చెరువులు, కుంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. భూగర్భ జలాలు తగ్గిపోవడంతో రైతులు రబీ పంటలు సాగు చేసుకోలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. రైతులకు సాగునీటి భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వేల కోట్ల రూపాయలతో నిర్మించిన మల్లన్నసాగర్ ప్రాజెక్టులో గోదావరి జలాలను నింపకుండా రైతులకు సాగునీరు ఎలా అందిస్తారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. రాజకీయ కక్షలు, విమర్శలను పక్కనపెట్టి ప్రాజెక్టులో గోదావరి జలాలను నింపాలని, ఉపకాలువల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ పనులు పూర్తయితే దుబ్బాక రైతులకు రబీ సాగుపై భరోసా లభిస్తుందని అన్నారు. గతంలో రైతుల ప్రయోజనాల కోసం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడం వల్లే ప్రస్తుత పరిస్థితులు ఏర్పడ్డాయని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in